ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

ఆదివారం 19 జనవరి 2025



సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ట్రాక్టర్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి మనోహర్, ఎమ్మెల్యే నరేంద్ర, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

- వాడవాడలా అన్నదానాలు.. రక్తదానాలు
- సంక్షేమ పథకాల రూపకర్తని కొనియాడిన నేతలు
- గుంటూరులో ఎన్టీఆర్ విగ్రహాలను ఆవిష్కరించిన పెమ్మసాని



గుంటూరులో జరిగిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ఎన్టీఆర్‌కు.. ఘననివాళులు

ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్, జనవరి 18: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాప కుడు.. మాజీ ముఖ్యమంత్రి.. స్వర్గీయ నందమూరి తారకరామారావుకు జిల్లావ్యాప్తంగా శనివారం ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు, అభిమా నుల నుంచి సామాన్య ప్రజల వరకు ఘనంగా నివాళులర్పించారు. వాడవాడలా ఎన్టీఆర్ విగ్రహాలను సుందరంగా అలంకరించిన అభిమానులు ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఇక ప్రధాన కూడళ్లలో ఎన్టీఆర్ చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పెద్దఎత్తున అన్నదానాలు చేశారు. కొన్ని దగ్గర్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయగా టీడీపీ శ్రేణులు, ఎన్టీఆర్ అభిమానులు రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. రక్తదానం చేసిన వారిని నేతలు ప్రత్యేకంగా అభినందించారు. పారిశుధ్య కార్మికు లకు, పేదలకు నేతలు దుస్తులు పంపిణీ చేశారు. గుంటూరు తూర్పులో ఎమ్మెల్యే నసీర్, పశ్చిమలో ఎమ్మెల్యే గళ్లా మాధవి, ప్రత్తిపాడులో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, పొన్నూరులో నరేంద్రకుమార్, తెనాలిలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. తెనాలిలోని పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించి రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. తాడికొండలో తెలుగు యువత ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్తిపాడు, కోయవారిపాలెం గ్రామాలలో ఎన్టీఆర్ విగ్రహాలను ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రారంభించారు.

- గుంటూరు కొరిటెపాడు, ఇన్నర్ రింగ్‌రోడ్డులో చిల్లీస్ సెంటర్లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాలను కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెండి తెరపై నట విశ్వరూపం, టీడీపీ కార్యకర్తలకు దైవ స్వరూపం అన్న నందమూరి అని కొనియాడారు. ఎన్టీఆర్ అంటే పేరు కాదు ఒక వైబ్రేషన్.. కాంగ్రెస్ కంచు కోటను కూల్చిన ఒక సెన్సేషన్.. అన్నారు. 40 ఏళ్ల క్రితం ఎన్టీఆర్ పెట్టిన పార్టీని చంద్రబాబునాయుడు కష్టపడి నిలబెట్టారన్నారు.
- గుంటూరు అరండల్‌పేటలోని టీడీ పీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ అధ్య క్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బూర్ల రామాంజ నేయులు, మొహమ్మద్ నసీర్, గల్లా మాధవి, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణ మూర్తి, ఏపీఐడీసీఎల్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, రామాంజనేయులు, మాధవి, నసీర్ తదితరులు

స్వచ్ఛత అందరి బాధ్యత

- పారిశుధ్య నిర్వహణపై క్రమశిక్షణ అవసరం
- స్వచ్ఛ ఆంధ్రా.. స్వచ్ఛ దివస్‌లో పవన్‌కల్యాణ్
- నంబూరులో చెత్త సంపద సృష్టి కేంద్రం పరిశీలన
- 35 మంది స్వచ్ఛ కార్మికులకు ఉపముఖ్యమంత్రి సత్కారం
- చెత్త రవాణా వాహనం ప్రారంభించి, స్వయంగా నడిపిన పవన్‌కల్యాణ్

చెత్త పునర్వియోగంతో సంపద

పెదకాకాని, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛత విషయాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలి. చెత్తే కదా.. ఏం చేస్తాం అని కాకుండా.. దాని నుంచి సంపద సృష్టించాలి. శుభ్రత, స్వచ్ఛత ప్రజల జీవన విధానంలో ఓ భాగం కావాలి. పరిసరాల శుభ్రత.. స్వచ్ఛత పరిరక్షణకు అందరూ కృషి చేయాలి..' అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. పెదకాకాని మండలం నంబూరు గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం వద్ద శనివారం మొక్కను నాటి 'స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత గ్రామ స్థాయిలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అనంతరం చెత్త సంపద కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను పరిశీలించారు. వ్యర్థాల నిర్వహణ, వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించారు. ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్, శానిటరీ వేస్ట్ మేనేజ్‌మెంట్ పరికరాల పనితీరు గురించి అధికారులను ప్రశ్నించారు. చెత్త సేకరణ, నిర్వహణ, సంపద సృష్టి తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తతో పాటు విష పూరిత వ్యర్థాలను వేరు చేసేందుకు ఇంటికి మూడు బుట్టలు ఇస్తున్నట్లు అధికారులు పవన్ కల్యాణ్‌కు చూపారు. చెత్త నిర్వహణలో ఉపయోగించే పరికరాల పనితీరుని తెలుసుకున్నారు. చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న గ్రామాల వివరాలు, సంపద సృష్టి కేంద్రాల సహకారంతో పండించిన పండ్లు, కూరగాయల ప్రదర్శనను తిలకించారు. అనంతరం చెత్త రవాణా వాహనాన్ని ప్రారంభించి, ట్రాక్టర్ నడిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో అందరూ పాటించినట్లుగా పారిశుధ్య నిర్వహణ, స్వచ్ఛత విషయంలో క్రమశిక్షణ మళ్లీ రావాలన్నారు. చెత్తను పునర్వియోగం చేసుకునేలా ఇంట్లోనే వేరు చేయాలన్నారు. చెత్త ద్వారా విద్యుత్ ప్లాంట్ల నిర్వహణ, వర్మీ కంపోస్టు తయారీకి స్థానిక సంస్థలు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమం ప్రారంభమైందని, ప్రతి నెల మూడో శనివారం నిరంతరాయంగా ఈ కార్యక్రమం నిర్వహించాలన్నారు.



దివ్యాంగుడితో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్



పారిశుధ్య కార్మికురాలిని సత్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పక్కన మంత్రి మనోహర్, ఎమ్మెల్యే నరేంద్ర, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

పారిశుధ్య సిబ్బంది సేవలు అమూల్యం

పారిశుధ్య సిబ్బంది సేవలు అమూల్యమైనవని పవన్‌కల్యాణ్ తెలిపారు. వారిని గౌరవించుకోవడం ప్రజలందరి బాధ్యతన్నారు. ఇటీవల విజయవాడ వరదల సమయంలో ఎంతో కష్టపడి పని చేసి, ప్రజల మన్ననలు అందుకున్న 35 మంది పారిశుధ్య సిబ్బందిని సత్కరించారు. ప్రతి ఒక్కరిని పేరు పేరున పలకరిస్తూ, శాలువా కప్పి నూతన వస్త్రాలు, పండ్లు బహూకరించారు. కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, కలెక్టర్ నాగలక్ష్మి, జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్ల ట్రెక్కింగ్...

6



కొండపల్లి కోటపై ట్రెక్కింగ్ చేస్తున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- పండగకు 250పైనే ఏర్పాటు
- రద్దీ దృష్ట్యా శని, ఆదివారాల్లో 76 బస్సులకు ప్రణాళిక
- ఇప్పటికే రూ.70 లక్షల పైనే ఆదాయం



8

జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు

- కెడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు అనుమతి



8

ఐదు నెలల్లో చినకాకాని - గుండుగొలను బైపాసు

- శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి ఏప్రిల్ మొదటి వారంలో శంకుస్థాపన
- ఔటర్ రింగ్‌రోడ్డుకు రూ.20 వేల కోట్ల వరకు నిధులు
- దిశా సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

ఫిబ్రవరి నెలాఖరు వరకు రెండు మెమూ రైళ్ల రద్దు

6

త్రిసభ్య కమిటీలు.. సహకార సంఘాల పాలకవర్గాలుగా నియమితులు కానున్నాయి. ఎన్నికలు జరిగే వరకు వారిదే అధికారం. ఆయా కమిటీలపై కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నెలాఖరు కల్లా కమిటీలను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఒక్కొక్క సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జిగా ఒకరిని, సభ్యులుగా ఇద్దరి పేర్లను ఎంపిక చేయాలి. ఈ బాధ్యతలను పార్టీ అధిష్ఠానం నియోజవకర్గాల వారీగా ఎమ్మెల్యేలకు అప్పగించింది. సొసైటీల వారీగా త్రిసభ్య కమిటీల కోసం ఎమ్మెల్యేలు పేర్లను సేకరిస్తున్నారు. కమిటీల్లో పదవుల కోసం కూటమి నేతల నుంచి ఎమ్మెల్యేలపై ఒత్తిడి అధికంగా ఉంటోంది. ఈ పరిస్థితుల్లో సొసైటీల వారీగా పేర్లను ఖరారు చేయడం ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది.

- 168 సహకార సంఘాలకు నియామకం
- నెలాఖరుకు ఏర్పాటు కానున్న కమిటీలు
- సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జి, ఇద్దరు సభ్యులు
- ఎన్నికల వరకు త్రిసభ్య కమిటీలకే అధికారాలు
- పదవుల కోసం నేతల నుంచి ఎమ్మెల్యేలపై ఒత్తిడి
- నియోజకవర్గాల వారీగా రూపొందుతున్న జాబితాలు

కమిటీలపై కసరత్తు



జొన్నలగడ్డ సొసైటీ కార్యాలయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 168 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. ఆయా సొసైటీల బాధ్యతలను త్రిసభ్య కమిటీలకు అప్పగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. సొసైటీలకు ఎన్నికలు నిర్వహించే వరకు త్రిసభ్య కమిటీలను కొనసాగించాలని ప్రభుత్వం భావిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సొసైటీల బాధ్యతలను పర్సన్ ఇన్‌చార్జ్‌లకు అప్పగించింది. అయితే పర్సన్ ఇన్‌చార్జ్ పాలనను కొనసాగిస్తూ ఉత్తర్వులు విడుదలతో నేతల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. ప్రభుత్వ నిర్ణయంపై సొసైటీ పదవులు ఆశించిన నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వం తన నిర్ణయంలో మార్పు చేసి త్రిసభ్య పాలనకు సిద్ధమైంది. దీంతో పదవులు ఆశిస్తున్న నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సొసైటీల వారీగా కమిటీల కోసం నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. కొన్ని సొసైటీలకు నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇటువంటి వాటికి ఆ పరిధిలోని మెజార్టీ నేతల అభిప్రాయంతో పేర్లను ఖరారు చేస్తున్నారు.

504 మందికి పదవులు

సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీల నియామకంతో కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలకు నామినేటెడ్ పదవుల పండుగ నెలకొంది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 504 మంది నేతలకు పదవులు లభించనున్నాయి. పార్టీ కోసం కష్టపడటంతో పాటు వైసీపీ హయాంలో తీవ్రంగా నష్టపోయిన వారికి ఆయా పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలని నేతలు కోరుతున్నారు.

అన్నీ చక్కదిద్దాకే ఎన్నికలు..

నిబంధనలకు విరుద్ధంగా సహకార సంఘాల్లో పార్టీ కార్యకర్తలను వైసీపీ నేతలు సభ్యులుగా చేర్చారు. సొసైటీల ఓటర్ల జాబితాల్లో పెద్దఎత్తున అవతవకలు ఉన్నట్లు కూటమి నేతలు

(మిగతా 8వ పేజీలో)

అయ్యో.. అంబటి

- రాంబాబుకి సీటు హుళక్కేనా?
- సత్తెనపల్లి ఇన్‌చార్జిగా డాక్టర్ గజ్జల
- గుంటూరు జిల్లా అధ్యక్ష బాధ్యతలకే పరిమితం
- పశ్చిమ సీటు ఆశించగా నిరాకరించిన జగన్
- సొంత నియోజకవర్గం రేపల్లే ఇక దిక్కా?



గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఉండదా అంటే ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు అవుననంటు న్నాయి. సత్తెనపల్లి ఇన్‌చార్జిగా ఉన్న ఆయనను ఇటీవల పక్కన పెట్టి గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో గుంటూరు పశ్చిమ సీటు ఆశించగా పార్టీ అధినేత జగన్ నిరాకరించారు. ఈ పరిస్థితుల్లో ఆయన వచ్చే ఎన్నికల్లో పోటీపై అనుమానాలు నెలకొన్నాయి. 2019 ఎన్నికల్లో అంబటి సత్తెనపల్లి నుంచి అప్పటి స్పీకర్ డాక్టర్ కోడెలపై విజయం సాధించి అమాత్య పదవిని దక్కించుకు న్నారు. అయితే నియోజకవర్గంలో వైసీపీకి ప్రధానంగా కొమ్ముకాసే ఓ సామాజిక వర్గం ఆయన తీరును తొలి నుంచి వ్యతిరేకిస్తూనే వచ్చింది. ఒక దశలో ఆయనకు తిరిగి టికెట్ ఇవ్వకుండా అడ్డుకునేందుకు గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, నలంద విద్యా సంస్థల అధినేత వరప్రసాదరెడ్డి తీవ్రంగా ప్రయత్నిం చారు. అయితే తన వాగ్ధాటితో నిత్యం టీడీపీపై బురద జల్లడంలో రాంబాబుది అందె వేసిన చేయి కావడంతో జగన్ అంబటి అభ్యర్థిత్వానికే మొగ్గు చూపారు. 2024 ఎన్నికల్లో పరాజయం పాలైన అంబటిని పదోన్నతి పేరుతో గుంటూరు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తూ సత్తెనపల్లి నుంచి ఉద్వాసన చెప్పారు. అంతే గాకుండా రెండు, మూడు రోజుల క్రితం సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డికి అప్పగిస్తూ జగన్ అధికారికంగా ప్రకటించారు. దీంతో అంబటికి సత్తెనపల్లి ద్వారాలు మూసుకుపోయాయి. కాగా అంబటికి గుంటూరు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సమయం లోనే గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ మంత్రి విడదల రజినికి చిలకలూరిపేట బాధ్యతలు అప్పగించారు. దీంతో తనకు గుంటూరు పశ్చిమ బాధ్యతలు అప్పగిస్తారని అంబటి ఆశించారు. ఈ క్రమంలో తనకు పశ్చిమ బాధ్యతలు అప్పగించాలని జగన్‌ను అంబటి కోరినా దాట వేసినట్లు సమాచారం. టీడీపీ కంచుకోటగా ఉన్న పశ్చిమ నియోజకవర్గంలో కొత్త ప్రయోగం చేసే ఉద్దేశంలో జగన్ ఉన్నట్లు పార్టీ నేతలు చెప్తున్నారు. తరచూ వివాదాస్పదంగా వ్యాఖ్యలు చేసే అంబటికి పశ్చిమలో అంత అనుకూల వాతావరణం కూడా ఉండదనే భావన ఆ పార్టీ నేతల్లో ఉంది. పైగా ఇదే నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టాలనే ఆశలో మేయర్ కావటి మనోహర్‌నాయుడు ఉన్నారు. చిలకలూరిపేట పగ్గాలు రజినికి అప్పగించడంతో గత ఎన్నికల్లో పోటీ చేసిన మనోహర్‌కు ఆ నియోజకవర్గంతో సంబంధాలు తెగిపోయాయి. ఈ పరిస్థితుల్లో అంబటికి తిరిగి తన సొంత నియోజకవర్గమైన రేపల్లె నుంచి పోటీ చేసే అవకాశం కల్పిస్తారనే వాదన వినిపిస్తున్నది. లేదంటే ఆయన్ను ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా ఉంచి, పార్టీ పరంగా ఉపయోగించుకునే ఆలోచన జగన్‌కు ఉందని ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది.

తెలుగు జాతి హృదయాల్లో చిరస్థాయిగా ఎన్టీఆర్

● విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య


ఎన్టీఆర్‌కు గ్రంథాలయ వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి హృదయాల్లో ఎన్టీఆర్ ఎప్పటికీ చిరస్థాయిగా ఉంటారని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఎన్‌టీఆర్ లైబ్రరీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ 29వ వర్ధంతి ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలు, మహిళలకు సమాన అవకాశాలు, విద్య, ఆరోగ్యం వంటి రంగాలలో ఆయన ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని కొనియాడారు. తెలుగు సినీ పరిశ్రమలో గొప్ప నటుడిగా ప్రతి పాత్రకు జీవం పోసి, ప్రేక్షకుల మనసు గెలుచుకున్నారన్నారు. ప్రజలతో కూడా ఆయనకున్న అనుబంధం ప్రత్యేకమని, అందరూ ప్రేమించే నాయకుడిగా ఎదిగారని వెల్లడించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ పోటీలకు ఏఎన్‌యూ మహిళా క్రికెట్ జట్టు

పెదకాకాని, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళా క్రికెట్ జట్టు సౌత్ జోన్ క్రికెట్ పోటీలకు సన్నద్ధమవుతోంది. ఈ నెల 23వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మైసూర్‌లో జరిగే ఈ పోటీలకు జట్టును ఎంపిక చేసినట్లు వ్యాయామ విద్య డైరెక్టర్ ప్రొఫెసర్ పీపీఎస్ పాల్ కుమార్ శనివారం తెలిపారు. విశ్వవిద్యాలయం ఏర్పాటు దగ్గర నుంచి ఇప్పటి వరకు మహిళల క్రికెట్ జట్టును ఎంపిక చేయలేదనీ, మొట్టమొదటిసారిగా ఈ ఏడాది ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ జట్టు 20వ తేదీ వరకు వర్సిటీలో శిక్షణ పొంది అనంతరం మైసూర్ వెళ్లనుందని పేర్కొన్నారు. జట్టు మేనేజర్‌గా సాధన డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జె.ప్రేమ్ కుమార్, కోచ్‌గా ఫిరంగిపురంలోని సెయింట్ జేవియర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ ఫిజికల్ డైరెక్టర్ కె.మోజెస్ వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

ఎన్నారైలు ముందుకు రావాలి

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్


స్కూల్‌ను ప్రారంభిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, ఆలపాటి, దాత సుధాకర్, సర్పంచి పవన్‌కుమార్

తెనాలి రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మాతృభూమి రుణం తీర్చుకునేలా ఎన్నారైలు ముందుకు రావాలని, సొంత గ్రామంలో విద్యాలయం నిర్మాణానికి ఎన్నారై ధూళిపాళ్ల సుధాకర్, మాధురి దంపతులు చేసిన కృషి అందరికీ స్ఫూర్తిదాయకమని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని నంది వెలుగు గ్రామంలో ప్రభుత్వ, దాతల సహకారంతో జడ్పీహెచ్‌ఎస్ స్కూల్ నూతన భవనం, ప్లే గ్రౌండ్, ప్రహరీ, క్లాస్ రూమ్‌ల తదితర మౌలిక వసతుల ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, దాతలు ఎన్నారై ధూళిపాళ్ల సుధాకర్, మాధురి కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి స్కూల్‌ను ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామంలో పిల్లల చదువుకు అవసరమైన మౌలిక వసతులతో స్కూల్ భవనాన్ని తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చిన ఎన్నారై ధూళిపాళ్ల కుటుంబ సభ్యులు, డబుల్ హార్స్ ఎండీ మునగాల శ్యామ్ ప్రసాద్, ఇతర దాతలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎన్నారైగా స్థిరపడినా, ధూళిపాళ్ల సుధాకర్ తాను చదివిన స్కూల్ దుస్థితిలో ఉండటాన్ని గుర్తించి దాని అభివృద్ధికి రూ. లక్షల ఖర్చు చేసి తీర్చి దిద్దడం గొప్పవిషయమన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎన్నారైగా సుధాకర్ మేము సైతం టీం ద్వారా గ్రామాభివృద్ధికి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. దాత సుధాకర్ మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన గ్రామానికి ఎంతో కొంత సేవ చేయాలని తన కుటుంబ సభ్యులకు సైతం ఎప్పటికప్పుడు చెబుతూ, దానిని ఆచరణలోకి తీసుకువచ్చామన్నారు. గ్రామ సర్పంచి ధూళిపాళ్ల పవన్‌కుమార్, దాతల సహకారంతో మేముసైతం టీం పర్యవేక్షణలో స్కూల్ భవనాన్ని ఇతర మౌలిక వసతుల కల్పనకు ముందుకు వచ్చామన్నారు. తొలుత అతిథులకు ఎన్‌సీసీ క్యాడెట్లు స్వాగతం పలికారు. వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాలల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, బి.సురేంద్ర, విజయలక్ష్మి, ఎంఈవోలు లక్ష్మీనారాయణ, జయంతి బాబు, నన్నపనేని లింగారావు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి నెలాఖరు వరకు రెండు మెమూ రైళ్ల రద్దు

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆపరేషనల్ సమస్యల దృష్ట్యా ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి నెలాఖరు(28వ తేదీ) వరకు రెండు మెమూ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 67769 విజయవాడ - గుంటూరు, నంబరు. 67770 గుంటూరు - విజయవాడ రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని సీపీఆర్‌వో విజ్ఞప్తి చేశారు.

నేడు, రేపు పలు ప్రత్యేక రైళ్లు

సంక్రాంతి పండగ సెలవులు ఆదివారంతో ముగియనుండటంతో రైళ్లలో రద్దీ తీవ్రత పెరిగింది. దాంతో ఆది, సోమవారంలలో పలు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదుగా నడిపేందుకు రైల్వే శాఖ నిర్ణయించినట్లు సీపీఆర్‌వో తెలిపారు. నంబరు 08510 చర్లపల్లి - విశాఖపట్నం రైలు ఈ నెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదుగా రాత్రి 10 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు 08551 విశాఖపట్నం - చర్లపల్లి రైలు ఈ నెల 19న సాయంత్రం 6.20కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.30కి విశాఖపట్నం చేరుకొంటుంది. నంబరు 08552 చర్లపల్లి - విశాఖపట్నం రైలు ఈ నెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు బయలుదేరి రాత్రి 10 గంటలకు విశాఖపట్నం చేరుకొంటుంది. నంబరు 08550 చర్లపల్లి - భువనేశ్వర్ రైలు ఈ నెల 19వ తేదీన ఉదయం 9 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి దాటాక 20వ తేదీ వేకువజామునకు ముందు 2.15కి భువనేశ్వర్ చేరుకొంటుంది.

23, 25 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లు

వెల్లూరు(స్వర్ణ దేవాలయం), తిరువణ్ణామలై(అరుణాచలం), శ్రీరంగం, మధురై తదితర ప్రాంతాలను సందర్శించే యాత్రికుల కోసం ఈ నెల 23, 25 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదుగా నడపనున్నట్లు సీపీఆర్‌వో తెలిపారు. ఈ నెల 23న నంబరు 07175 సికింద్రాబాద్ - కొల్లం, 25న నంబరు 07176 కొల్లం - సికింద్రాబాద్ ప్రత్యేక రైళ్లను గుంటూరు మీదుగా నడుపుతామన్నారు.

కొనసాగుతున్న ట్రెక్కింగ్ క్యాంపు


ట్రెక్కింగ్‌లో పాల్గొన్న క్యాడెట్లు

గుంటూరు (విద్య), నరసరావుపేట కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ ట్రెక్ 3 కార్యక్రమంలో భాగంగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ల ట్రెక్కింగ్ క్యాంపు కొనసాగుతోంది. శనివారం కొండవీడు చెక్‌పోస్టు నుంచి చారిత్రాత్మక కొండవీడు కోట వరకు 7 కి.మీ. ట్రెక్‌లో క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ ట్రెక్ కేవలం క్యాడెట్ల స్థైర్యాన్ని, క్రమశిక్షణను చూపించడమే కాకుండా, ఈ ప్రాంత సాంస్కృతిక వారసత్వాన్ని వెలుగులోకి తెచ్చింది. ట్రెక్ ముగిసిన తర్వాత క్యాడెట్లు రెడ్డి రాజుల వారసత్వ మ్యూజియాన్ని సందర్శించారు. కొండవీడు కోట చరిత్ర, ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. రెడ్డివంశ పాలన, కోట ఆర్కిటెక్చర్ పరిశీలించే అవకాశం లభించినట్లు విద్యార్థినులు పేర్కొన్నారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 18 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ ట్రెక్కింగ్ క్యాంపులో పాల్గొన్నారని కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు శనివారం తెలిపారు. గుంటూరు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న క్యాంపులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 510 మంది విద్యార్థినులు పాల్గొన్నారని తెలిపారు.

యడ్లపాడు-1 వీఆర్వో సుభాని సస్పెన్షన్?

యడ్లపాడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు-1 వీఆర్వో షేక్ సుభాని సస్పెండ్ అయ్యారు. సుభానిపై పలువురు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ విచారణ జరిపారు. ఆరోపణలు రుజువు కావడంతో సస్పెండ్ చేసినట్లు తెలిసింది. భూములకు సంబంధించి రికార్డులు తారుమారు చేయడం, లంచం డిమాండ్ చేయడం, అసైన్డ్ భూములకు పట్టాలు ఇప్పిస్తానంటూ పెద్ద మొత్తంలో నగదు వసూళ్లకు పాల్పడడం వంటి ఆరోపణలతో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు అందాయి. దీంతో కలెక్టర్ అరుణ్‌బాబు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో తక్కెళ్ళపాడు రెవెన్యూ గ్రామంలో వీఆర్వోగా పనిచేసిన సమయంలోనూ పలు అక్రమాలకు పాల్పడగా అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. కొద్ది నెలల సస్పెన్షన్ తరువాత నూజెండ్ల మండలానికి కేటాయించారు. అయితే అప్పటి తహసీల్దార్ అతడిని చేర్చుకునేందుకు ఇష్టపడలేదు. దీంతో వీఆర్వో బంధువు వైసీపీ నాయకుని సిఫార్సుతో వంకాయలపాడు వీఆర్వోగా డిప్యూటేషన్‌పై వచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక సుభానిని వేరొక మండలానికి బదిలీ చేయగా అక్కడ చేర్చుకోకపోవడంతో తిరిగి యడ్లపాడు-1 వీఆర్వోగా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. అయితే వంకాయలపాడు వీఆర్వోగా పనిచేసిన సమయంలో పలువురి వద్ద నుంచి వసూళ్లకు పాల్పడి పనులు చేయకపోవడంతో వారంతా ఫిర్యాదులు చేయడం, విచారణలో నిజమని తేలడంతో సస్పెండ్ చేసినట్లు సమాచారం.

విశాఖకు రూ.11 వేల కోట్లు ప్యాకేజీ శుభపరిణామం

● మంత్రి అనగాని సత్యప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం రూ.11 వేల కోట్లకు పైగా ప్యాకేజీ ప్రకటించటం శుభపరిణామం అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నష్టాల్లో ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను గట్టెక్కించేందుకు ఆర్థిక సాయం చేసిన ప్రధాన మంత్రి మోదీకి మంత్రి అనగాని కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ 1గా నిలిపేందుకు సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషికి మోదీ ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అన్నీ అమలు చేస్తామని తెలిపారు. త్వరలో తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, మహిళలకు నెలకు రూ.1500 త్వరలో అందించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పోలవరం ప్రాజెక్టు డయాఫ్రమ్ వాల్ నిర్మాణం తిరిగి ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రంలో నదుల అనుసంధాన ప్రాజెక్టుకి కూడా కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తుందని తెలిపారు. అమరావతి రాజధాని దేశానికే ఒక ఆదర్శం కాబోతుందన్నారు. సమావేశంలో కృష్ణా పశ్చిమ డెల్టా కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ నాయకులు గూడపాటి శ్రీనివాసరావు, మేకా వెంకటశివరామకృష్ణ, దండుప్రోలు వెంకటేశ్వరరావు, కొమ్మూరి వెంకటేశ్, రేపల్లె సురేష్, పాపారావు, దేవగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

26న తెలుగు నాటకం, స్త్రీవాదంపై సదస్సు


మాట్లాడుతున్న వేదిక అధ్యక్షుడు సురేష్‌బాబు, సభ్యులు

యడ్లపాడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ, తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం (వేదిక) సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు నాటకం, స్త్రీవాదం అనే అంశాలపై సదస్సును ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు వేదిక అధ్యక్షుడు ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. శనివారం యడ్లపాడులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు గ్రామీణ ప్రాంతంలో నిర్వహించడం ఇదే తొలిసారనీ, సాధారణంగా మహానగరాలు, పట్టణాలలో మాత్రమే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యడ్లపాడులో రచ్చబండ సెంటర్‌లోని ముత్తవరపు సురేష్‌బాబు నివాస ప్రాంగణంలోని సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సదస్సు జరుగుతుందని, తెలుగు నాటకం, సాహిత్యం, స్త్రీవాదం రంగాల్లో అనుభవజ్ఞులైన ప్రముఖులు పాల్గొంటారన్నారు. తెలుగు నాటకం, స్త్రీవాదంపై మహిళల్లో చైతన్యం కల్పించే ఉద్దేశంతో నిర్వహించే ఈ సదస్సుకు జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేసే మహిళా ఉపాధ్యాయులు, పది, ఇంటర్ చదివే విద్యార్థినులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సుమారు 300 మంది హాజరవుతారన్నారు. సమావేశంలో వేదిక సంయుక్త కార్యదర్శి పోపూరి నాగేశ్వరరావు, సభ్యులు ముత్తవరపు రామారావు పాల్గొన్నారు.

ముడుపులు ఇవ్వలేదని.. ప్రయోజనాలు ఆపారు

● కలెక్టర్‌కు విశ్రాంత ఉద్యోగిని ఫిర్యాదు

● చావే శరణ్యమని వేడుకోలు


మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగి పద్మావతి

గుంటూరు సిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో అంతులేని నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ముడుపుల మత్తులో ఉన్న మినిస్టీరియల్ సిబ్బంది శాఖలో పని చేసిన వారిని కూడా పీడిస్తున్నారు. అడిగినంత ఇస్తే సరే, లేకుంటే అంతే అన్న విధానంలో అల్లాడిస్తున్నారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు పనిచేసిన మహిళా ఉదోగిని ఆర్థిక బిల్లుల చెల్లింపు వ్యవహారంలో జరిగిన జాప్యం వైద్య, ఆరోగ్య శాఖ అవినీతికి నిదర్శనంగా నిలిచింది. పి.పద్మావతి వట్టిచెరుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ విజిటర్‌గా పనిచేస్తూ 2024 ఏప్రిల్ 30న ఉద్యోగ విరమణ పొందారు. ఆమె ఉద్యోగ విరమణకు ముందే ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన ఫైల్‌ను సిద్ధం చేయాల్సి ఉంది. సదరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డ్రాయింగ్ అధికారి, సీనియర్ అసిస్టెంట్ ఆ విషయాన్ని పట్టించుకోలేదు. ఉద్యోగ విరమణ చేసిన తర్వాత అయినా అన్ని బిల్లులు ట్రెజరీలో సమర్పిస్తారని పద్మావతి భావించారు. బాధ్యులైన అధికారుల్లో ఎటువంటి చలనం లేకపోవడంతో బాధితురాలు చాలా పర్యాయాలు ఆస్పత్రికి వచ్చి ప్రాధేయపడ్డారు. విషయాన్ని బాధితురాలు జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. గత తొమ్మిది నెలలుగా ఆస్పత్రి చుట్టూ తిరుగుతున్నా బిల్లులను సిద్ధం చేయకపోవడంతో బాధితురాలు శనివారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిశారు. వట్టిచెరుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డీడీవో గుమ్మడి వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ కార్తీక్‌పై ఫిర్యాదు చేశారు. తనకు రావాల్సిన ఉద్యోగ విరమణ ప్రయోజనాల చెల్లింపు వ్యవహారంలో ఇబ్బందులు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రూ.మూడు వేలు ఇంటి అద్దె కూడా చెల్లించలేని దుస్థితిలో ఉన్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సత్వరమే న్యాయం జరగకపోతే తనకు చావే శరణ్యం అని బాధితురాలు జిల్లా కలెక్టర్ ముందు కన్నీటి పర్యంతం అయ్యారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన అనంతరం పద్మావతి విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన తరువాత కూడా తనను ఎంతగానో వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. అడిగినంత ముడుపులు ఇవ్వలేను అన్నందుకు ఇలా వేధించారని అన్నారు.

విస్తరణ పనులు ప్రారంభం



గుంటూరు కార్పొరేషన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో పెరిగిన ట్రాఫిక్ నియంత్రణకు నగరంలోని శంకర్ విలాస్ ఆర్.ఓ.బి నిర్మించుటకు ఇప్పటికే అనుమతులు మంజూరయ్యాయని, నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా నగర పాలక సంస్థ తరుపున చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనులు శనివారం నుంచి ప్రారంభించామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలియజేశారు. శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణ పనుల నిమిత్తం చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మొత్తం 134 ఆస్తులలో బ్రాడీపేట అరండల్ పేటలకు సంబంధించిన 99 భవన యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. వారి ఆస్తి అర్హతను బట్టి భవన యజమానులకు నష్టపరిహారం ఇస్తామన్నారు.

ప్రియురాలు తిరస్కరించిందని ప్రియుడు ఆత్మహత్య

బాపట్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రియురాలు తిరస్కరించిందని ప్రియుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై చంద్రావతి తెలిపిన వివరాల మేరకు.. దుగ్గిరాల మండలం శృంగారపురం గ్రామానికి చెందిన శృంగారపాటి మురళీకృష్ణ (22) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటాడు. అదేమండలం చిన్నపాలెం గ్రామానికి చెందిన ఓ వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. శుక్రవారం ఉదయం మంగళగిరి ఎయిమ్స్‌లో పని ఉందని చెప్పి వచ్చిన మురళీకృష్ణ స్కూటీపై ఆమెను తీసుకొని బాపట్ల పట్టణంలోని భావన లాడ్జిలో భార్యభర్తలమని చెప్పి రూమ్ తీసుకున్నారు. సూర్యలంక సముద్రతీరానికి వెళ్లి వచ్చారు. అక్రమ సంబంధం వలన మీ కుటుంబ సభ్యులు తిడుతున్నారనీ, ఇకపై రానని ఆమె చెప్పటంతో మనస్తాపానికి గురైన మురళీకృష్ణ బయటకెళ్లి పురుగుమందు తెచ్చుకొని తాగాడు. ఆమె లాడ్జి ఓనర్‌కు చెప్పటంతో అంబులెన్స్ పిలిపించి ఆస్పత్రికి తరలించారు. అనంతరం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా మురళీకృష్ణ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	142.151.162
చికెన్ విత్ స్కిన్	274.00
చికెన్ స్కిన్ లెస్	284.00

8 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ ఖాదర్ బేగ్ శనివారం స్వాధీనం చేసుకున్నారు. పట్టాభిపురం ఎస్సై ఆంజనేయులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఫిరంగిపురానికి చెందిన మేడా నాగేశ్వరరావు అనే వ్యక్తి బొలెరో వాహనంలో 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా శ్యామ లానగర్ రైల్వే గేట్ వద్ద డిప్యూటీ తహసీల్దార్ స్వాధీనం చేసుకొని పట్టాభిపురం పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు రేషన్ బియ్యం వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతి చాప్టర్ ఛైర్మన్‌గా నారంశెట్టి వెంకట శివనాగరాజు

గుంటూరు(తూర్పు), జనవరి 18(ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట, ఓ హోటల్లో అమరావతి చాప్టర్ కార్యవర్గ ఎన్నిక, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రెటరీస్ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్ ఛైర్మన్‌గా నారంశెట్టి వెంకట శివనాగరాజును ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఆయనతో పాటు ఉపాధ్యక్షుడుగా సిద్ధార్థ, కార్యదర్శిగా మహమద్ అబ్బాస్ సయ్యద్, కోశాధికారిగా గుడిపాటి శివరామప్రసాదు, కార్యవర్గ సభ్యులుగా కురువెళ్ల విజయ్‌కుమార్, సోము శివ రామకృష్ణ, శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శివనాగరాజు మాట్లాడుతూ 75 వేల మంది సభ్యులు, 2లక్షలకు పైగా ఉన్న విద్యార్థులు కల్గిన చాప్టర్ అభ్యున్నతికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మరణించిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలి

గుంటూరు(తూర్పు), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కరోనాతో మరణించిన ప్రభుత్వ ఉద్యోగ కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా అన్నారు. మెడికల్ కళాశాల ఆవరణలోని సంఘ కార్యా లయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

'అమిత్ షా క్షమాపణలు చెప్పాలి'

గుంటూరు(తూర్పు), జనవరి 18(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్‌పై చేసిన అవమానకర వ్యాఖ్యలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా క్షమాపణలు చెప్పాలని, లేని పక్షంలో రాష్ట్రంలో అడుగుబెట్టనివ్వమని వామపక్ష నాయకులు హెచ్చరించారు. అమిత్ షా రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ శనివారం శంకర్ విలాస్ సెంటర్లో ధర్నా చేపట్టారు.



కాట్రగడ్డ ప్రసాదును సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రముఖులకు ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారం

గుంటూరు(తూర్పు), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కె.ఆర్.కె. ఈవెంట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కళాపరిషత్ 20వ నాటకోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా, శనివారం ప్రముఖులకు ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కార సభ జరిగింది. సభకు పరిషత్ కన్వీనర్ కాట్రగడ్డ రామకృష్ణప్రసాద్ అధ్యక్షత వహించారు. అతిథులుగా విద్యాసంస్థల డైరెక్టర్ పీవీ శంకర్రావు, ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సంస్థ సభ్యులు వేములపల్లి విఠల్, బొప్పన నరసింహారావు (బుజ్జి), జి. మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ సెంటినరీ సెల బ్రేషన్స్ కమిటీ వైస్ ఛైర్మన్ కాట్రగడ్డ ప్రసాదు, కన్వీనర్ అట్లూరి నారాయణరావు లను ఎన్టీఆర్ ఆత్మీయ పురస్కారంతో సత్కరించారు. సభానంతరం సహృదయ ద్రోణాదుల వారు అద్దేపల్లి భరత్ కుమార్ రచనకు, డి.మహేంద్ర దర్శకత్వం వహించిన 'వర్క్ ఫ్రం హోం' నాటికను ప్రదర్శించారు.



చీపురుతో రోడ్డును శుభ్రం చేస్తున్న డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్

ప్రజల జీవన విధానంలో స్వచ్ఛత భాగం కావాలి

● డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్

గుంటూరు(తూర్పు), జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి జీవన విధానంలో స్వచ్ఛత భాగం కావాలని బీజేపీ తూర్పు నియోజక వర్గ కన్వీనర్, డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ అన్నారు. స్థానిక శనక్కాయల ఫ్యాక్టరీ వీధిలోని, అహల్య ఆస్పత్రి సమీపంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం శుభ్రత అనేది పారిశుధ్య కార్మికులకు, క్లాప్ మిత్రులకు పరిమితం కాదని అన్నారు. స్వచ్ఛత అనేది ప్రజల ఆలోచనకు ప్రతిరూపం కావాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, స్వచ్ఛతను కాపాడటం అనేది మన అందరి బాధ్యతగా భావించాలన్నారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా అడుగులు వేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ మున్నం సుష్మ, డాక్టర్ సింధూర, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆశయాలకు పునరంకితమవుదాం

● జిల్లా వ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలు.. ఘన నివాళులు
● పలు చోట్ల విగ్రహావిష్కరణలు
● తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్ : ఎమ్మెల్యే మాధవి
● పేదల జీవితాల్లో వెలుగు నింపారు : ఎమ్మెల్యే నసీర్
● కష్ట జీవుల ఆకలి తీర్చిన యుగపురుషుడు : డేగల, మన్నవ



నాజ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే నసీర్, డేగల ప్రభాకర్ తదితరులు

గుంటూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతికార్యక్రమాలు శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఆయా కార్యక్రమాలను అట్టహాసంగా నిర్వహించారు. ఎన్టీఆర్‌ను స్మరించుకుని, ఆయన ఆశయాల సాధనకు పునరంకితమయ్యేందుకు ప్రతిజ్ఞ చేశారు.

● గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో..

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో, ఆ తరువాత పలుచోట్ల జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గళ్లా మాధవి పాల్గొని ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. భారీగా అన్నదాన, సేవాకార్యక్రమాలు నిర్వహించారు. సాయిబాబా రోడ్డు, ముత్యాలరెడ్డినగర్, గుజ్జనగుండ్లరోడ్డు, అరండల్ పేట లైబ్రరీ, ఎస్వీఎన్ కాలనీ మెయిన్ రోడ్డు, స్తంబాల గరువు, మణిహోటల్ సెంటర్, మిర్చి యార్డు మెయిన్ గేటు, ఎన్జీవో కాలనీ లలోని విగ్రహాలకు ఆమె నివాళులర్పించారు. అమరావతి రోడ్డులో, లక్ష్మీపురంలోని కే.యఫ్.సి వద్ద, మారుతీనగర్ లోని ఉమెన్స్ పాలిటెక్నిక్ కళాశాల వద్ద, స్వామి థియేటర్ వద్ద, కంకరగుంట గేట్ వద్ద, నల్లచెరువు 7వ లైన్, శ్రీనివాసరావు పేట 60 అడుగుల రోడ్డు పీర్ల చావిడి వద్ద ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంపాలెంలోని రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద, 3 బొమ్మల సెంటర్ వద్ద, కొరిటెపాడు వద్ద ఎన్టీఆర్ విగ్రహాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ బీసీ, ఎస్సీ ఎస్టీ, ముస్లిం మైనారిటీల బడుగు బలహీన వర్గాలనే విభేదాలు లేకుండా అందరికి రాజ్యాధికారాన్ని తెచ్చిన మహానుభావుడు ఎన్టీఆర్ అని కొనియాడారు.

● గుంటూరు తూర్పు నియోజకవర్గంలో

ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గుంటూరులోని వివిధ ప్రాంతాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గంలోని ఐపీడీ కాలనీ, ఎన్టీఆర్ ఐలాండ్, నాజ్ సెంటర్, సంగడి గుంట, డీఎస్ నగర్, అరుంధతి నగర్, మంగళదాస్ నగర్, ప్రకాశ్ నగర్, బొంగరాల బీడులలోని ఎన్టీఆర్ విగ్రహాల వద్ద ఎమ్మెల్యే నసీర్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపారని, బడుగు బలహీన వర్గాల వారికి రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించిన సమతావాది ఎన్టీఆర్ అని కొనియాడడారు. ఎన్టీఆర్ ఆశయాలను సీఎం చంద్రబాబు నేతృత్వంలో ముందుకు తీసుకెళతామని చెప్పారు. ఐపీడీ కాలనీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సోదరుడు పెమ్మసాని రవి పాల్గొన్నారు. కార్యక్రమంలో పోతురాజు సమత, జాగర్లమూడి శ్రీనివాస్, కొనకళ్ళ సత్యం, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, రబ్బాని, అబ్దుల్ ఖుద్దుస్, రహమతున్నిసా, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

● నాజ్ సెంటర్లో..

స్థానిక నాజ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే నసీర్, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డేగల ప్రభాకర్ మాట్లాడుతూపేదల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ఎన్టీఆర్ ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం టీడీపీని స్థాపించారని, 9 నెలల్లోనే తెలుగు ప్రజలు ఎన్టీఆర్‌ను సీఎం చేశారని, అదే ఆయనపై ప్రజలకున్న నమ్మకమని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోతురాజు సమత, కొత్తూరి వెంకట్, షేక్ ఫిరోజ్, సొపాటి రత్నం తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరులోని 22వ డివిజన్ మైనారిటీ నాయకుడు నైజాం బాబు ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాసరావుపేట 60 అడుగుల రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్(ఏపీటీఎస్) ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● జిల్లా కోర్టు వద్ద టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు చుక్కపల్లి రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు.

ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చిన ఎన్టీఆర్: ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తెలుగు జాతికి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ప్రత్తిపాడు, గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, మొహమ్మద్ నసీర్, గల్లా మాధవి, శాసనమండలి మాజీ సభ్యుడు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, ఏపీఐడీసీఎల్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యేలు నసీర్, మాధవి, బూర్ల రామాంజనేయులు, జంగా కృష్ణమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో గుంటుపల్లి శేషగిరిరావు, మద్దిరాల మ్యాని, కసుకుర్తి హనుమంతరావు, సుఖవాసి శ్రీనివాసరావు, కంచర్ల శివరామయ్య, జంపని హనుమంతరావు, మహాలక్ష్మి, కల్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి అసోసియేషన్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే నసీర్ గజమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో హాస్టల్‌కు బీరువాలు, విద్యార్థులకు ఐరన్ బాక్సులు, పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చిర్రావూరు సాంబశివరావు, జుజ్జూరి మల్లికార్జునరావు, కేతేపల్లిపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.

● అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వీరాభిమాని ఎన్ సదాశివం , సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● నెహ్రూనగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజా మాస్టారు పూలమాలలు వేసి నివాళులర్పించారు.





శ్రీనివాసరావుపేటలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మన్నవ మోహనకృష్ణ, నెహ్రూనగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దాసరి రాజా మాస్టారు



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు

తెలుగువారి గుండెలపై చెరగని సంతకం ఎన్టీఆర్

● కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
● అట్టహాసంగా ఎన్టీఆర్ విగ్రహాల ఆవిష్కరణ

గుంటూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగువారి గుండెలపై చెరగని సంతకం అన్న నందమూరి తారక రామారావు అని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా స్థానిక కొరిటెపాడు కూడలిలో, ఇన్నర్ రింగ్ రోడ్డులోని చిల్లీస్ సెంటరులో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాలను శనివారం సాయంత్రం ఆయన ఆవిష్కరించారు. ఆయా చోట్ల ఎన్టీఆర్ వర్ధంతి కార్య క్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ వెండి తెరపై నట విశ్వరూపం, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు దైవ స్వరూపం ఎన్టీఆర్ అని ప్రశంసించారు. 'ఎన్టీఆర్ అంటే పేరు కాదు, ఒక 'వైబ్రేషన్' అని, కాంగ్రెస్ కంచు కోటను కూల్చిన ఒక సెన్సేషన్ అని కొనియాడారు. రాయలసీమ నుంచి కోనసీమ వరకు తెలుగు వారి గుండెల్లో ఉండే ఒక ఎమోషన్ అని చెప్పారు. కొమ్మినేని కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గతంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయనివ్వలేదని, ఈ రోజున ఆపగలరా అని ప్రశ్నించారు. 40 ఏళ్ల క్రితం ఎన్టీఆర్ పెట్టిన తెలుగుదేశం పార్టీని ఎండనకా, వాననకా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కష్టపడి నిలబెట్టారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, కన్నా లక్ష్మీ నారాయణ, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, నసీర్, మాజీ మంత్రి పెదరత్తయ్య ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయాల దిశగా ముందుకు సాగుతామని, ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో లిడ్ కాప్ ఛైర్మన్ పీ మాణిక్యాలరావు, ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాస్, మ్యానీ, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, స్థానిక కార్పొరేటర్లు నూకవరపు బాలాజీ, పోతురాజు సమత, ఈరంటి వరప్రసాద్, మన్నవ వంశీకృష్ణ, వేములకొండ శ్రీనివాస్, వేములకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి, పాల్గొన్న కన్నా నాగరాజు తదితరులు

గుంటూరు(తూర్పు), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్ రోడ్డులో ప్రముఖ న్యాయవాది యారవ తిరుపతయ్య సహకారంతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, మాజీ మేయర్ కన్నా నాగరాజు కలిసి ఆవిష్కరించారు. 23వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు లాం వర్ధనరావు, లాం నవమి, రాజేష్, మస్తాన్ వలి, ముక్తున్, సుభాని, చిన్న హుస్సేన్ పాల్గొన్నారు.

ఉరుసు మహోత్సవాలు



మస్తాన్ బాబా సమాధికి గంధాన్ని సమర్పిస్తున్న రావి రామ్మోహనరావు

గుంటూరు(తూర్పు), జనవరి 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీటీ రోడ్డులోని హజరత్ కాలే మస్తాన్ షా అవులియా 133వ ఉరుసు మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమాల్లో భాగంగా శనివారం మస్తాన్ బాబా వారికి గంధం సమర్పణ, దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం జరిగింది. సాయంత్రం భక్తులకు గంధాన్ని పంపిణీ చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఖురాన్ పఠనం, అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ జరుగుతుందని దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు తెలిపారు.

దర్గాలో ఎమ్మెల్యే నసీర్ ప్రార్థనలు

గుంటూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16 నుంచి ప్రారంభమైన లాలాపేట చిన్నబజారులోని హజరత్‌సయ్యద్ షా ఔలియా దర్గా షరీఫ్ ఉరుసు మహోత్సవాలకు తూర్పు ఎమ్మెల్యే నసీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముతవల్లి షేక్ ఖాదర్ బాబా పాల్గొన్నారు..

విధుల్లో చేరనున్న వెస్ట్, సౌత్ డీఎస్పీలు



వెస్ట్ డీఎస్పీ కే అరవింద్



సౌత్ డీఎస్పీ జీ భానోదయ

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు వెస్ట్, సౌత్ డీఎస్పీలుగా నియమితులైన కే అరవింద్, జీ భానోదయ విధుల్లో చేరనున్నారు. 2018 గ్రూప్-1 నోటిఫికేషన్ ద్వారా వారు డీఎస్పీలుగా ఎంపికయ్యారు. ప్రస్తుతం వారు గ్రేహౌండ్స్‌లో విధులు నిర్వహిస్తున్నారు. వారు సోమవారం విధుల్లో చేరే అవకాశం ఉన్నట్టు పోలీసు వర్గాలకు సమాచారం అందింది. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జయరామ్‌ప్రసాద్, మలికార్జునరావులకు పోస్టింగ్స్ ఇవ్వాల్సి ఉంది.



ఎంపిక చేసిన ట్రాఫిక్ వలంటీర్లతో ట్రాఫిక్, ట్రాన్స్‌పోర్ట్ అధికారులు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు వలంటీర్లు

● ఎంపిక చేసిన 25 మందికి శిక్షణ ప్రారంభం

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకుగాను జిల్లా ట్రాఫిక్ వాలంటీర్ పేరుతో 25 మందిని ఎంపిక చేసి వారికి శిక్షణ ఇచ్చారు. జిల్లా పోలీస్, ట్రాన్స్‌పోర్ట్ విభాగాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ మేరకు శనివారం ఎస్పీ సతీష్ కుమార్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సీతారామరెడ్డి ఆదేశాల మేరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు -2025 సందర్భంగా వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రహదారి భద్రతా నియమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో 'జిల్లా ట్రాఫిక్ వాలంటీర్లు' పేరుతో ఆసక్తి కలిగిన 25 మంది యువతీయువకులను ఎంపిక చేసి వారికి రహదారి భద్రతా నియమాల గురించి అవగాహన కల్పించేందుకు శనివారం శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతులు నెల రోజుల పాటు నగరంలోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు గోపాల్, సౌజన్యలు పాల్గొని పలు అంశాలను ట్రాఫిక్ వాలంటీర్లకు వివరించారు. ఈస్ట్ ట్రాఫిక్, వెస్ట్ ట్రాఫిక్ పోలీస్ సీఐలు అశోక్‌కుమార్, సింగయ్య, జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు - 2025 లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఎంటీబీ సెంటర్ వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి లైసెన్సులు, సరైన వాహన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుమును విధించారు. వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీస్, ట్రాన్స్‌పోర్టు అధికారులు స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్ వద్ద వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్' మెగా ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు మాధవి, నసీర్, ఎస్పీ సతీష్ కుమార్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్'లో భాగంగా శనివారం స్థానిక కలెక్టరేట్ నుంచి హిందూ కాలేజీ జంక్షన్ వరకు మెగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ తో కలిసి కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. ప్రభుత్వం ఆశించిన విధంగా ఈ కార్యక్రమాలను విజయవంతం చేస్తామని చెప్పారు. ఈ ర్యాలీ కార్యక్రమాలను నగరంలోని 206 సచివాయాల పరిధిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే మాధవి మాటాడుతూ గుంటూరులో 'వెస్ట్ టు ఎనర్జీ' అనే నినాదంతో బృహత్తర కర్యాక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ప్రతి నెలా 3వ శనివారం ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేశారని, ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ఇటు వంటి కార్యక్రమాలు విజయవంతం అవుతాయన్నారు. హిందూ కాలేజీ జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. స్వచ్ఛతపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్పీ సతీశ్‌కుమార్, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమీషనర్లు డి. శ్రీనివాసరావు, సి.హెచ్ శ్రీనివాసరావు, టి. వెంకట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ భాగస్వామ్యం ఎంతో ముఖ్యం

నగరాభివృద్ధిలో, స్వచ్ఛతా కార్యక్రమాల్లో సీనియర్ సిటిజన్స్ భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్'లో భాగంగా సీనియర్ సిటిజన్లను స్థానిక నాయుడుపేటలోని నగర పాలక సంస్థ లెగసి వెస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కు తీసుకువెళ్లారు. వ్యర్థాల నుంచి పవర్‌ను తయారు విధానాన్ని వివరించారు. సీనియర్ సిటిజన్ల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో వారితో పాటు కలిసి కమిషనర్ కూడా ప్రయాణించారు. తొలుత నాయుడు పేటలోని ప్లాంట్‌ను, అనంతరం జిందాల్ వెస్ట్ టు ఎనర్జి ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటారు. ఎన్‌హెచ్-5 పక్కన పడి ఉన్న ప్లాస్టిక్, చెత్త వ్యర్థాలను సీనియర్ సిటిజన్లు, అధికారులతో కలిసి కమిషనర్ తొలగించారు.

ఎన్టీఆర్ బస్టాండ్‌లో..

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్ టీఆర్ బస్టాండ్‌లో గుం టూరు-1, 2 డిపో మేనే జర్లు రామకృష్ణ, అబ్దుల్ సలామ్‌ల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. గుంటూరు-2 డిపో మేనే జర్ అబ్దుల్ సలాం ఆధ్వర్యంలో డిపో గ్యారేజీ ఆవ రణలో పిచ్చి మొక్కలను తొలగించారు. బస్సుల నుంచి తీసివేసిన విడిభాగాలను అక్కడ నుంచి వర్క్ షాపునకు పంపించారు. తీసివేసిన ఆయిల్ బ్యారల్స్‌ను క్రమ పద్ధతిలో ఏర్పాటు చేశారు. ఎండిపోయిన చెట్ల కొమ్మలను తగులపెట్టి ఆవరణను శుభ్రం చేశారు. ట్రాఫిక్ సెక్షన్‌లోని కంట్రోల్ చార్ట్ వద్ద అసిస్టెంట్ మేనేజర్ సాంబశివ ఆధ్వర్యంలోనూ వ్యర్థాలను తొలగించి పరిసరాల పరిశుభ్రతపై సిబ్బందికి సూచనలు చేశారు. గుంటూరు-1 డిపో ఎంవీఎస్ రామకృష్ణ ఆధ్వర్యంలో డిపో గ్యారేజ్‌లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. డిపో సూపర్‌వైజర్‌లు, గ్యారేజ్ సిబ్బంది కలిసి గ్యారేజ్‌లో వ్యర్థాలను తొలగించి రెండు గంటల పాటు పరిశుభ్రత కార్య క్రమం చేపట్టారు.

1520 అంగన్వాడీ కేంద్రాల్లో విజయవంతం

గుంటూరు సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 1520 అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం నిర్వహించిన 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్' విజయవంతమైనట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి విజయలక్ష్మి తెలిపారు. అన్ని కేంద్రాల్లో పరి సరాలను, వంటశాలలను, ఆవరణలో ఏర్పాటు చేసిన తోటలను కూడా శుభ్ర పరిచినట్లు తెలిపారు.



కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో పాల్గొన్న జేసీ భార్గవ తేజ

ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: జేసీ

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధిపతులదేనని జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ తేజ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో ఆయన డీఆర్వో షేక్ ఖాజావలితో కలసి చెత్త, వ్యర్థాలను తొలగించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో వారి కార్యా లయాలను శుభ్రపరచుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ప్రతీ మూడో శనివారమే కాకుండా నిరంతరం కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవడంపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్డీవో శ్రీనివాస రావు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, డ్వామా పీడీ శంకర్, హౌసింగ్ పీడీ ప్రసాద్, మత్స్య శాఖ డీడీ గాలిదేముడు, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, డీటీసీ సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు శుభ్రం చేసిన ఎమ్మెల్యే



ప్రజలందరి సహకారంతోనే ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధ్యమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. 'స్వచ్ఛ ఆంధ్రా-స్వచ్ఛ దివస్'లో భాగంగా రోడ్లను ఆయన శుభ్రం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడతూ. అందరూ ఆరో గ్యంగా ఉండాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ఇది ప్రజలందరి కార్యక్రమమని చెప్పారు. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరులో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించా మన్నారు. కార్యక్రమంలో ఏపీఐడీసీఎల్ ఛైర్మన్ డేగల ప్రభాకర్, జమీర్, గౌస్, ఉస్మాన్, పిచ్చి రెడ్డి, జాగర్లమూడి శ్రీనివాస్, టీడీపీ నాయకులు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి: డీటీసీ

గుంటూరు(తూర్పు), జనవరి 18(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతానియమాలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఉప రవాణ కమిషనర్ కే సీతారామిరెడ్డి అన్నారు. స్థానిక నెహ్రూ యువ కేంద్రంలో రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా స్థాయి ట్రాఫిక్ వాలంటీరింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ నెహ్రూ యువకేంద్ర సంఘటన్ రాష్ట్ర సంచాలకులు అంశుమాన్ ప్రసాద్ దాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడుతూ అతి వేగం మంచిది కాదని, వాహనదారులు విధిగా శిరస్త్రాణం, సీట్ బెల్టు ధరించాలని అన్నారు. ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ మాట్లాడుతూ మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కిరణ్మయి దేవిరెడ్డి, ఎన్ గోపాల్, ఎం ఎన్ శివారెడ్డి, ఎస్ రాంబాబు పాల్గొన్నారు.

గుంటూరు:


స్మార్ట్ హెల్మెట్ ప్రాజెక్టుతో సందుపాలెం దర్గా, గైడ్ టీచర్ ఎస్వీ రామాంజనేయులు


గగన్‌యాన్ ప్రాజెక్టుతో శారదానికేతన్ విద్యార్థిని ఈర్షిత, అనిశాబేగం


సేవ చేసే రోబోట్ నమూనాతో నారాకోడూరు జడ్పీస్కూల్ విద్యార్థిని నజ్మ


గనివి శ్రీనివాసరావు రూపొందించిన అయస్కాంత క్షేత్రాల ప్రాజెక్టు

వారెవ్వా.. బాల శాస్త్రవేత్తలు

● వైజ్ఞానిక ప్రదర్శనలో అబ్బురపరిచిన విద్యార్థులు
● జాతీయ స్థాయి పోటీలకు పలు ప్రాజెక్టులు ఎంపిక
● రేపటి నుంచి పుదుచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి ప్రదర్శనలో చోటు


మల్టీపర్పస్ అగ్రికల్చర్ మెషిన్ ప్రాజెక్టుతో గ్రూపు విద్యార్థులు కె.వెంకటేష్, సీహెచ్‌సాయిరామ్ ధీరజ్, గైడ్ టీచర్ మోహనాంజలి

బాపట్ల:


స్మార్ అండ్ సేఫ్ అగ్రికల్చర్ ప్రాజెక్టుతో ప్రత్యూష, గైడ్ టీచర్ పి. వినీత


దాచేపల్లి: అంబు బ్యాగ్ నమూనాను ప్రదర్శిస్తున్న దాచేపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థి ప్రజాపతి దిలీప్

(బాపట్ల, గుంటూరు(విద్య), దాచేపల్లి - ఆంధ్రజ్యోతి)

వినూత్న ఆలోచనలకు వైజ్ఞానిక సృజన జోడిస్తే అద్భుతాలు సాధించవచ్చని ఆ విద్యార్థులు నిరూపించారు. విజయవాడ వేదికగా ఈ నెల 7, 8 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి పలువురు విద్యార్థులు వివిధ అంశాలపై ప్రాజెక్టులను ప్రదర్శించారు. వాటిలో జిల్లాకు రెండేసి చొప్పున ప్రాజెక్టులను జాతీయ స్థాయికి ఎంపిక చేశారు. ఆయా విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయిలో ఉత్తమంగా నిలిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. ఆ ప్రాజెక్టులను ప్రదర్శించిన బాల శాస్త్రవేత్తల ఆలోచనలను పలువురు అభినందించారు. సైన్స్ ప్రదర్శనలతో పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి సత్తాచాటిన విద్యార్థులు ఈ నెల 21 నుంచి 25 తేదీ వరకు పుదుచ్చేరిలో జరిగే జాతీయ స్థాయిలో పోటీలకు సిద్ధమయ్యారు. విద్యార్థులు ఈ ప్రాజెక్టుల రూపకల్పన కోసం నెల రోజుల పాటు శ్రమించారు. ప్రదర్శనలో ఉత్తమంగా ఉండాలంటే తొలుత అత్యున్నతమైన ఐడియా కోసం టీచర్లతో కలిసి విద్యార్థులు మేధోమథనం చేశారు. ఇప్పుడు ఈ విద్యార్థులు జాతీయ స్థాయిలో కూడా విజయం సాధించేందుకు వారికి ఉపాధ్యాయులు సహకరిస్తున్నారు.

రైతుల కోసం..

మల్టీపర్పస్ అగ్రికల్చర్ మెషిన్ ప్రాజెక్టును సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సాయిరామ్ ధీరజ్, కె.వెంకటేష్ రూపొందించారు. దీని వల్ల రైతులు పురుగుమందులు పిచికారి చేయడం సులభం అవుతుంది. ట్యాంకును ట్రాలీ మీద ఉంచి చేతితో నెట్టడం తద్వారా ఆక్సిలేటర్ మోషన్ అండ్ చైన్ మెకానిజమ్ ద్వారా ఇది ఆపరేట్ అవుతుంది. ఎలాంటి ఇంధనం అవసరం లేకుండానే కేవలం రైతులు చేతితో నెట్టడం ద్వారానే దీనిని వాడుకోవచ్చు. కేవలం రూ.5,000తో దీనిని రైతులకు అందుబాటులోకి తేవచ్చు. పొలాలకు మందుకోసం ఇప్పుడు వాడుతున్న స్ప్రేయర్ల వల్ల రైతుల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. దీనికి పరిష్కారంగానే ఈ ప్రాజెక్టుని రూపొందించాం.

వాతావరణం అంచనా వేసేలా

స్మార్ట్ అండ్ సేఫ్ అగ్రికల్చర్ ప్రాజెక్టును బాపట్ల మండలం నర్సాయపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని జి.ప్రత్యూష రూపొందించారు. దీనితో వాతావరణ పరిస్థితులను అంచనా వేయవచ్చు. రైతులకు ఇదే ఉపయోగపడుతుంది. వెదర్, టెంపరేచర్ సెన్సార్లు దానిలో అమర్చాం. విత్తు నాటింది మొదలు కోతల వరకు ఏ సమయం అనుకూలమో రైతులే స్వయంగా తెలుసుకోవచ్చు. తుఫాన్ల సమయంలో కరెంటు స్తంభాలు పడిపోయి రైతులు చనిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ పరికరం ద్వారా ముందుగానే డిఫాల్ట్ ఉన్న స్తంభాలను గుర్తించి సదరు విభాగాన్ని అలర్ట్ చేయడానికి ఈ ప్రాజెక్టు ఉపకరిస్తుంది.

సోలార్ స్మార్ట్ హెల్మెట్

ద్విచక్రవాహన ప్రమాదాల్ని నిలువరించేందుకు ముట్లూరుకు చెందిన సందుపాలెం దర్గా గైడ్ టీచర్ వీఎస్ రామాంజనేయులు ఆధ్వర్యంలో సోలార్ స్మార్ట్ హెల్మెట్ తయారు చేశారు. ఈ హెల్మెట్ ధరిస్తేనే బైక్ స్టార్ట్ అయ్యేలా దీనిని రూపొందించాను. మద్యం తాగినా హెల్మెట్‌లో సెన్సార్స్ ద్వారా గుర్తిస్తుంది. కొత్తగా బైక్‌లు విక్రయించే కంపెనీలు ఈ హెల్మెట్‌తో విక్రయిస్తే ప్రమాదాలు తగ్గుతాయి. అంతేకాదు ఈ హెల్మెట్‌కు బ్లూటూత్, సంగీతం వినేలా ఏర్పాట్లు ఉన్నాయి. నావిగేషన్, మొబైల్ చార్జింగ్ కోసం సోలార్ కమ్యూనికేషన్ సిస్టమ్ అందుబాటులో ఉంటుంది. ,

పది విద్యార్థుల కోసం

పదో తరగతి భౌతిక శాస్త్రంలో విద్యుదయస్కాంతత్వం అనే పాఠ్యాంశాన్ని విద్యార్థులు కష్టంగా భావిస్తారు. దీనిని గమనించి జీజీపాలెం జడ్పీస్కూల్ ఉపాధ్యాయుడు గవిని శ్రీనివాసరావు పాఠాలకు సంబంధించిన విషయాలు సులభంగా నేర్చుకునేలా ప్రాజెక్టు తయారు చేశారు. విద్యుత్ ప్రవాహం వల్ల అయస్కాంత క్షేత్రం, సరళరేఖలా ఉన్న విద్యుత్ అయస్కాంత క్షేత్రం, వలయాకారపు తీగచుట్టవల్ల ఏర్పడే అయస్కాంత క్షేత్రం, సాలినాయిడ్ వల్ల ఏర్పడే అయస్కాంత క్షేత్రాలను ప్రాజెక్టు రూపంతో తీసుకువచ్చి విద్యార్థులకు వివరించే ప్రయత్నం చేశారు.

సేవ చేసే రోబోట్

ఆపద సమయంలో సేవ చేసేలా రోబోట్‌ను నారాకోడూరు జడ్పీ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థిని నజ్మా రూపొందించారు. రోగులకు ఆహారం, మందులు అందించడానికి వీలుగా ఈ రోబోట్‌ను రూపొందించారు. దివ్యాంగులకు, హోటల్స్‌లో, మాల్స్‌లో ఆహార పదార్థాలు పంపిణీ చేయడానికి ఈ రోబోట్‌ను ఉపయోగించవచ్చు. మనిషి శ్రమను తగ్గించేలా దీనిని రూపొందించారు.

గగన్‌యాన్

ఇస్రో అంతరిక్షంలోకి ముగ్గురితో కూడిన బృందాన్ని పంపిన వివరాలు తెయలిజేస్తూ శారదానికేతన్ ఓరియంటల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులు ఎండీ అనిషాబేగం, ఎస్ ఈర్షితలు గగన్‌యాన్ ప్రాజెక్టు రూపొందించారు. ఈ ప్రాజెక్టు గగన్‌యాన్‌కు సంబంధించి పూర్తిస్థాయి సమాచారం తెలియజేస్తుంది.

ఆస్తమా రోగుల కోసం..

ఆస్తమా రోగులకు అత్యవసర సమయాల్లో శ్వాస అందించేందు కోసం అంబు బ్యాగ్‌ను దాచేపల్లి జడ్పీ హెచ్‌ఎస్ విద్యార్థి ప్రజాపతి దిలీప్ రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. ప్రస్తుతం ఆస్మా రోగులకు ఉపయోగపడే కృత్రిమ శ్వాస మిషన్ కొనుగోలు చేయాలంటే రూ.3 లక్షల వరకు వెచ్చించాలి. అయితే కేవలం రూ.3 వేలు వెచ్చించి డ్రిల్లింగ్ మిషన్, పిస్టన్, ప్రజర్ బ్యాగ్ ఉపయోగించి అంబు బ్యాగ్‌ను తయారు చేశారు. ఇది రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

అపూర్వ కలయిక

● 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న వైద్యులు
● జీఎంసీ 1975వ బ్యాచ్ స్వర్ణోత్సవ సంబరాలు


జింకానా ఆడిటోరియంలో 1975వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

గుంటూరు మెడికల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వారంతా గుంటూరు వైద్య కళాశాలలో 1975వ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులు. దేశ విదేశాల్లో వైద్యవృత్తిలో రాణిస్తున్నారు. వైద్య విద్యలో ప్రవేశించిన యాభై ఏళ్ల తర్వాత శనివారం వారంతా గుంటూరు వైద్య కళాశాలలో కలుసుకున్నారు. మిత్రులను చూసి పాత జ్ఞాపకాలను తలచుకుని పులకించిపోయారు. శనివారం జింకానా ఆడిటోరియంలో జీఎంసీ 1975వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాటి బ్యాచ్‌కు చెందిన బీవీ విజయ్‌కుమార్, కేవీఎస్ శివకుమార్, ఎన్నారై తేజానంద్‌గౌతమ్ మూల్పూరి, జీ సూర్యప్రకాశ్, ఈశ్వర్, ఇందిరా కుమారి, సుజాత, వై అజిత్‌బాబు, రవిప్రసాద్, పీ ఆదివిష్ణు, ఆదినారాయణలతో పాటు పలువురు ఈ సంబరాల్లో పాల్గొన్నారు. విద్యాభ్యాసం నాటి పాత జ్ఞాపకాలను మరోసారి నెమరు వేసుకున్నారు. ఇకపై ప్రతి రెండేళ్లకు ఒకసారి జీఎంసీలో కలుసుకోవాలని తీర్మానించారు. విద్యాబుద్ధులు నేర్పి మంచి వైద్యులుగా ఎదిగేందుకు దోహదం చేసిన తమ నాటి గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం కూడా 75వ బ్యాచ్ స్వర్ణోత్సవ సంబరాలు కొనసాగుతాయి.

జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు

● కెడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు అనుమతి


జీవన్‌దాన్ అనుమతి పత్రంతో రమణ యశస్వి, వైద్యులు

గుంటూరు మెడికల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలకు అనుమతి లభించింది. మృతదేహాల నుంచి సేకరించిన కాలేయం మాత్రమే (కెడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్) నిర్వహించేందుకు అనుమతి ఇస్తూ ఏపీ జీవన్‌దాన్ ట్రస్ట్ చైర్మన్ ఉత్తర్వులు జారీ చేశారు. హ్యూమన్స్ ఆర్గాన్స్ యాక్ట్ 1994, ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ యాక్ట్ 1995 ప్రకారం అనుమతులు జారీ చేసినట్లు వైద్య విద్య సంచాలకుల కార్యాలయం నుంచి శనివారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వికి అధికారిక సమాచారం అందింది. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ల నిర్వహణకు అనుమతివ్వాలని కోరుతూ ప్రభుత్వ సమగ్రాస్పత్రి వైద్యులు 2023 ఆగస్టులో ట్రస్ట్‌కు రాతపూర్వంగా విజ్ఞప్తి చేశారు. అనంతరం ట్రస్ట్ నుంచి నిపుణులు జీజీహెచ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగాన్ని సందర్శించి తనిఖీలు చేశారు. సర్జికల్, మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్టులు అందుబాట్లో ఉండటం, ఇతర సౌకర్యాలు కూడా ఉన్నట్లు గుర్తించడంతో కాలేయ మార్పిడి ఆపరేషన్లకు అనుమతులు లభించాయి. మూడేళ్ల వరకు ఇది వర్తిస్తుంది. త ర్వాత కమిటీ మరోసారి తనిఖీలు చేసి రెన్యువల్ చేస్తేనే, ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు కొనసాగుతాయి. జీవన్‌దాన్ ట్రస్ట్ నుంచి అనుమతులు లభించడంతో జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సల నిర్వహణకు వైద్యాధికారులు సన్నద్ధమవుతున్నారు. ప్రైవేటు వైద్యరంగంలో కాలేయ మార్పిడి ఆపరేషన్‌కు రూ.25 లక్షల వరకు ఖర్చు అవుతుంది. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఉచితంగా ఈ ఆపరేషన్లు చేస్తారు. కాలేయ మార్పిడి కోసం ఎదురుచూసే పేద రోగులకు ఇది ఎంతో మేలు చేస్తుందని చెప్పవచ్చు. ఇప్పటికే జీజీహెచ్‌లో మూత్రపిండాల మార్పిడి, గుండె మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్న విషయం తెలిసిందే. తాజాగా కాలేయ మార్పిడి సర్జరీలకూ అనుమతి లభించింది.

ఐదు నెలల్లో చినకాకాని - గుండుగొలను బైపాసు

● శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి ఏప్రిల్ మొదటి వారంలో శంకుస్థాపన
● ఔటర్ రింగ్‌రోడ్డుకు రూ.20 వేల కోట్ల వరకు నిధులు
● దిశా సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని



కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో పాల్గొన్న కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు, అధికారులు

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చినకాకాని - గుండుగొలను బైపాసు రోడ్డుని ఐదు నెలల్లో పూర్తి చేసి హైదరాబాద్ జాతీయ రహదారిని అమరావతికి అనుసంధానం చేస్తామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశా) సమావేశం శనివారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో డాక్టర్ పెమ్మసాని సమీక్షించి పలు సూచనలు అందజేశారు. గత ప్రభుత్వంలో నిలిపివేసిన అండర్ పాస్ బ్రిడ్జీలు 2026 జూలై నెలాఖరుకు పూర్తి చేస్తామని అధికారులు మంత్రికి తెలిపారు. త్వరలో నందివెలుగు బ్రిడ్జి పనులు మొదలు పెడతామన్నారు. శంకర్ విలాస్ ఆర్‌వోబీకి ఏప్రిల్ మొదటి వారంలో శంకుస్థాపన చేస్తామని మంత్రి తెలిపారు. జాతీయ రహదారుల విస్తరణ కోసం భూ సేకరణ డీపీఆర్‌ల రూపకల్పనపై అధికారులతో సమీక్షించారు. జాతీయ రహదారుల నిర్మాణం, ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం 2026 జనవరి నాటికి పూర్తి చేస్తామన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు విషయంలో రెండు నెలల లోపు పూర్తి అలైన్‌మెంట్ చేస్తామని అధికారులు మంత్రికి తెలిపారు. ఇన్నర్ రింగ్‌రోడ్డు పనులకు వచ్చే నెల టెండర్లు పిలుస్తామన్నారు. రైల్వే బ్రిడ్జిల నిర్మాణాన్ని రూ.110 కోట్లతో చేపడతామన్నారు. ఆర్‌వోబీ, ఆర్‌యూబీల నిర్మాణంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అమృత్ - 2 వాటర్ స్కీమ్‌కు డీపీఆర్‌లు సిద్ధం చేశామని పరిశీలన దశలో ఉన్నాయని అధికారులు మంత్రికి తెలిపారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో పీఎంజీఎస్‌వై పథకం కింద 12 రోడ్లు నిర్మాణానికి సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు.

మూడు నెలలకోసారి సమీక్ష..

గుంటూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు జరిగే పథకాలను ప్రజాప్రతినిధుల, అధికారులతో ప్రతి మూడు నెలలో కొకసారి దిశా సమావేశంలో సమీక్షిస్తామని మంత్రి పెమ్మసాని విలేకర్ల సమావేశంలో తెలిపారు. అసంపూర్తిగా వున్న నందివెలుగు బ్రిడ్జి కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు రూ.10 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. మరో రూ.30 కోట్లు అయితే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయవచ్చన్నారు. ఇందుకు సంబంధించి డీపీఆర్‌లు సిద్ధం చేయమని అధికారులను ఆదేశించామన్నారు. శ్యామలనగర్ బ్రిడ్జిని రెండు లైన్లకు పరిమితం చేయడం జరిగిందన్నారు. మంగళగిరి, పెదపలకలూరు బ్రిడ్జిలకు డీపీఆర్‌లు పూర్తి అయ్యాయని, వాటిని రైల్వే అధికారులకు పంపామన్నారు. అమృత్ - 2 పథకం కింద రూ.184 కోట్లతో ఒకటి, రూ.25 కోట్లతో మరొక ప్రాజెక్ట్‌కు చేపట్టే కార్యక్రమంపై సమీక్షించామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పరిస్థితిపై సమీక్షించామన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డుకు రూ.17 వేల కోట్ల నుంచి రూ.20 వేల కోట్ల వరకు నిధులు వస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఆర్వో షేక్. ఖజావలి, జడ్పీ సీఈవో జ్యోతిబసు, వివిధ శాఖల జిల్లా, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కమిటీలపై కసరత్తు

(5వ పేజీ తరువాయి)

గుర్తించారు. వీటిని సరిదిద్దిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. సహకార సంఘాలకు చివరగా 2013లో ఎన్నికలు జరిగాయి. 2018 నుంచి ఎన్నికలు నిర్వహించలేదు. అప్పట్లో సొసైటీల అధ్యక్షుల పదవీ కాలం 2019 వరకు పొడిగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సొసైటీలకు ఎన్నికలు నిర్వహిస్తారని రైతులు ఆశించారు. అయితే సొసైటీల వారీగా సభ్యులను గుర్తించాల్సి ఉంది. కొత్త ఓటర్ల జాబితాల రూపకల్పనలో జాప్యం జరిగే అవకాశం ఉండటంతో త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 168 సహకార సంఘాల్లో 12,31,363 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఎన్నికలు నిర్వహిస్తేనే సొసైటీలను బలోపేతం చేయడంతో పాటు రైతుల ప్రయోజనాలకు పెద్ద పీట వేసే అవకాశం ఉంటుంది. ఈ దిశగా ప్రభుత్వం స్పందించాలని రైతులు కోరుతున్నారు.

వైసీపీ హయాంలో నిర్వీర్యం..

వైసీపీ ఐదేళ్ల పాలనలో సహకార రంగాన్ని నిర్వీర్యం చేశారు. వైసీపీ ప్రభుత్వ నిర్ణయాల ఫలితంగా సహకార వ్యవస్థ ఆర్థి కంగా కుదేలైంది. సహకార రంగాన్ని ఐదేళ్ల దోచేశారు. నాబార్డు ద్వారా వచ్చిన నిధుల్ని కూడా పంచుకుతిన్నారు. రుణాల పంపి జీలో కూడా అవకతవకలు పెద్దఎత్తున జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. కొన్ని సంఘాల్లో రూ.లక్షల్లో కుంభకోణాలు జరిగినట్లు ఇప్పటికే జరిగిన విచారణల్లో వెలుగు చూశాయి. చాలా సంఘాలు నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఎరువులు అమ్మకాలను నీరు గార్చి రైతు భరోసా కేంద్రాలకు అప్పగించారు. ఇంధన బంకులు, జన ఔషధి కేంద్రాలు ఇలా అన్నింటిలోనూ వైసీపీ వారికే ప్రాధాన్యం కల్పించారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా సొసైటీల్లో త్రిసభ్య పాలన విధానాన్ని ప్రవేశపెట్టింది. రైతులకు సొసైటీలకు మధ్య దూరం పెంచింది. ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన కమిటీలను నియమించింది. పార్టీ వ్యక్తులను నామినేషన్ పద్ధతిలో కమిటీలను ఎంపిక చేసింది. దీంతో సొసైటీలు పూర్తి రాజకీయ కేంద్రాలుగా మారిపోయాయి. సహకార సంఘాలు రాజకీయా లకు అతీతంగా పనిచేయల్సి ఉండగా వీటిలో మితిమీరిన రాజకీయ జోక్యంతో రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. వైసీపీ బాటలోనే కూటమి ప్రభుత్వంఎన్నికలు నిర్వహించేందుకు ఆసక్తి చూపకపోవడంపై రైతుల నుంచి విమర్శలు వస్తున్నాయి.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

● పండగకు 250పైనే ఏర్పాటు
● రద్దీ దృష్ట్యా శని, ఆదివారాల్లో 76 బస్సులకు ప్రణాళిక
● ఇప్పటికే రూ.70 లక్షల పైనే ఆదాయం

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు ఆర్టీసీకి అదనపు ఆదాయం సమకూరింది. అధికారులు ముందుగా భావించినట్లుగానే ఆర్టీసీకి ప్రయాణికుల రద్దీ కనిపించింది. పండగకు గుంటూరుకు వచ్చే వారి కోసం ప్రత్యేకంగా 171 బస్సులను ఏర్పాటు చేశారంటే ప్రయాణికుల రద్దీ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ఇక కనుమకు తిరుగు ప్రయాణికులు పెద్దగా ఉండరని అధికారులు భావించినా అందుకు భిన్నంగా ప్రయాణికుల జోరు కనిపించింది. దాంతో కనుమ, తరువాత రోజు రెండు రోజులు ప్రయాణికుల రద్దీతో 75 బస్సుల వరకు సమకూర్చారు. పండగకు గుంటూరుకు వచ్చే ప్రయాణికుల కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, వైజాగ్ నుంచి గుంటూరుకు 171 బస్సులు ఏర్పాటు చేశారు. దాంతో ఆర్టీసీకి రూ.45లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక పండగ ముగిసిన తరువాత తిరుగు ప్రయాణికుల కోసం అదనపు సర్వీసులు ఏర్పాటు చేశారు. అయితే కనుమ రోజు పెద్దగా రద్దీ ఉండదని భావించినా కనుమ రోజు రాత్రి, తరువాత రోజు రెండు రోజులు అదనంగా 75 బస్సులు ఏర్పాటుచేశారు. తద్వారా మరో రూ.25 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లు చెబుతున్నారు. కాగా విద్యాసంస్థలు సోమవారం నుంచి పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో శని, ఆదివారాలు రాత్రి గుంటూరు నుంచి తిరుగు ప్రయాణమయ్యే వారు, వచ్చే వారి రద్దీ ఎక్కువగా ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇందు కోసం అదనంగా మరో 75 సర్వీసులు ఏర్పాటు చే సేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

ప్రణాళిక సిద్ధం

పండగకు వచ్చిన ప్రయాణికులు గుంటూరు నుంచి తిరుగు పయనమయ్యేందుకు శని, ఆదివారం రాత్రులు వెళ్లనున్నారు. ఇందుకోసం అదనంగా మరో 75 సర్వీసులు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశాం. ఎప్పటికప్పుడు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సర్వీసులను ఏర్పాటు చేస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి మానిటరింగ్ చేస్తున్నాం.

- జిల్లా ప్రజారవాణాధికారి రవికాంత్


ప్రయాణికులతో రద్దీగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్

అంతర్ జిల్లా దొంగల అరెస్టు

● రూ.84.5 లక్షల విలువైన 1.206 కిలోల బంగారు ఆభరణాలు స్వాధీనం

శ్రీకాకుళం క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లాల దొంగలను అరెస్ట్ చేసిన శ్రీకాకుళం పోలీసులు రూ.84.44 లక్షల విలువైన బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం ఈ వివరాలు వెల్లడించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పత్తికాయలవలస గ్రామానికి చెందిన పున్నాన రాంబాబు విజయవాడలో ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. క్రికెట్ కోచింగ్ తీసుకుని రంజీలోకి ఎంపిక కాక, చెడువ్యసనాలకు బానిసై నేరాలకు పాల్పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో విజయవాడ, గుంటూరు, ఎస్.కోట, రాజాం, విజయనగరం, చీపురుపల్లి, రణస్థలం, లావేరుతో పాటు రాష్ట్రంలో పలు పోలీసు స్టేషన్ల పరిధిలో 30 పైగా కేసుల్లో జైలుకు వెళ్లాడు. 2022 జూన్‌లో అరెస్టై గతేడాది జనవరి 10న విశాఖపట్నం సెంట్రల్ జైలు నుంచి విడుదలైన రాంబాబు, జైలులో పరిచయమైన శ్రీకాకుళం జిల్లా జి.సిగడాం మండలం గెడ్డ కంచరాం గ్రామానికి చెందిన గిడిజాల కోటేశ్వరరావుతో కలిసి నేరాలకు పాల్పడేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేదీన ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో ఐదున్నర తులాల బంగారు కాసుల పేరు, ఒక తులం బంగారు చైన్ పోయినట్టు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ నెల 17న ఎచ్చెర్ల మండలం అరిణాం అక్కివలస కూడలిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న రాంబాబు, కోటేశ్వరరావును విచారించగా అసలు విషయం బట్టబయలైంది. జిల్లాలో ఏకంగా 32 చోట్ల దొంగతనాలకు పాల్పడినట్లు వారిద్దరూ అంగీకరించారు. వీరి నుంచి రూ.84,44,800 విలువ చేసే 1.206 కిలోల బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు. ఇంకా మరో 250 గ్రాముల బంగారం బ్యాంకులో తాకట్టులో ఉందని, వాటిని కూడా స్వాధీనం చేసుకుంటామని ఎస్పీ వివరించారు.

బాలల పరిరక్షణ, హక్కులపై అవగాహన

మంగళగిరి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలోని జంగాల కాలనీలో శనివారం బేటీ బచావో-బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. బాలల పరిరక్షణ, హక్కులు, చట్టాలను గురించి తల్లిదండ్రులు, కిశోరి బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను గురించి కళాజాత బృందం పాటలు, కథల రూపంలో తెలియజేసింది. అంగన్‌వాడీ వర్కర్ జయశ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి, ఏఎన్‌ఎంలు, ఎంఎస్‌కేలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఏపీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

• డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్


డిప్యూటీ సీఎంను కలిసిన ఏఏఏ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలు ఎక్కడున్నా సంఘటితంగా ఉండాలని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ (ఏఏఏ) వ్యవస్థాపకుడు హరి మోటుపల్లి, జాతీయ అధ్యక్షుడు బాలాజీ వీర్నాల, అసోసియేషన్ ప్రతినిధులు శనివారం మంగళగిరిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిశారు. అసోసియేషన్ కార్యకలాపాలు, సంస్థల లక్ష్యాలను గురించి వివరించారు. మార్చి 28, 29 తేదీల్లో జరుగనున్న ఏఏఏ తొలి జాతీయ సదస్సుకు హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ తెలుగు జాతి అభ్యున్నతికి ఏఏఏ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు విస్తృతంగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రవాసాంధ్రులను కార్యోన్ముఖులను చేయాలని కోరారు.

ఈ-11 రహదారి ఇబ్బందులపై వినతి


మంత్రి లోకేశ్‌ను కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు

మంగళగిరి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలోని ఇండస్ట్రియల్ పార్కు అసోసియేషన్ ప్రతినిధులు శనివారం రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. ఈ-11 రహదారి వల్ల పారిశ్రామికవాడలో తలెత్తే ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తమ విన్నపంపై మంత్రి లోకేశ్ సానుకూలంగా స్పందించినట్టు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి బహదూర్, సభ్యులు షేక్ సలీమ్, అజయ్‌బాబు, ఎం వంశీకృష్ణ, ఆర్ శ్రీనివాసరావు, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య తదితరులు పాల్గొన్నారు.

లైవ్ మ్యూజిక్ షోకు ముమ్మర ఏర్పాట్లు

మంగళగిరి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్ జన్మదినోత్సవం సందర్భంగా ఈ నెల 23వ తేదీన మంగళగిరి ఎన్నారై ఆస్పత్రి ఎదురుగా నిర్వహించనున్న ప్రైడ్ ఆఫ్ మంగళగిరి లైవ్ మ్యూజిక్ షోకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సుమారు పదెకరాల ఖాళీస్థలాన్ని సిద్ధం చేస్తున్నారు. టీడీపీ నేతలు ఆవల రవికిరణ్, ఈపూరి రవి ఆధ్వర్యంలో కంప చెట్ల తొలగింపు పనులు జరిపిస్తున్నారు.

దివ్యాంగుల పింఛన్‌లపై వైద్యాధికారుల తనిఖీ

వట్టిచెరుకూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్‌లపై శనివారం ప్రత్యేక బృందం సభ్యులు లబ్ధిదారుల గృహాలను సందర్శించి తనిఖీలు చేసి వారి వద్ద ఉన్న సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆ సర్టిఫికెట్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఎంపీడీవో రమేష్‌బాబు పర్యవేక్షణలో కాట్రపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేశ్వరరావు, జీజీహెచ్, ఇతర విభాగాల నుంచి వచ్చిన ప్రత్యేక బృందం సభ్యులు మండల వ్యాప్తంగా తనిఖీ చేపట్టారు. వారి సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నారు. శనివారం సాయంత్రానికి 25 మందిని విచారించినట్టు బృందం సభ్యులు తెలిపారు.

మోదీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ

మంగళగిరి సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షా పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ అంబేద్కర్‌ను అవహేళనగా మాట్లాడిన అమిత్‌షా పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ అమిత్‌షా ఏపీ పర్యటన సందర్భంగా నిరసనలు తెలియజేయాలని పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాడేపల్లి టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మోర్తోట సుబ్బారావు (పంపుల సుబ్బారావు) కంకిపాడు వెళ్లి బోర్లు పని చూచి ద్విచక్రవాహనంపై వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతో శనివారం మృతి చెందాడు. తాడేపల్లి పశు వైద్యశాల రోడ్డు వద్ద నివసించే సుబ్బారావు ఆకస్మిక మృతికి సీపీఎం నేతలు, ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం నాయకులు ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.

ఎన్టీఆర్ చిరస్మరణీయుడు

- పలు గ్రామాల్లో వర్ధంతి సభలు
- విగ్రహాలకు, చిత్రపటాలకు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకుల నివాళులు
- పేదలకు అన్నదానాలు

తాడికొండ జనవరి 18(ఆంధ్రజ్యోతి): దివంగత నందమూరి తారక రామారావు పేదల హృదయాల్లో చిరస్మరణీయుడు అని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు చౌక ధరలకు సరుకులు, వస్త్రాలు, పక్కా గృహాలు కట్టించిన ఘనత ఎన్టీఆర్‌దేనని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, దామచర్ల శ్రీనివాసరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడికొండలోని చింతచెట్టు సెంటర్, పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు, కో-ఆపరేటివ్ బ్యాంకు మాజీ చైర్మన్ ఎడ్డూరి వీర హనుమంతురావు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో బీసీలకు పెద్ద పీటవేసిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. అనంతరం తెలుగుయువత అధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని కంతేరు, బండారుపల్లి, మోతడక, నిడుముక్కల, ఫణిదరం, లాం, దామరపల్లి, గరికపాడు, ముక్కామల, రావెల, పొన్నెకల్లు గ్రామాల్లోని ఎన్టీఆర్ విగ్రహాలకు, ఎన్టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. పేదలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

● పేదల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన ఎన్టీ రామారావు ఆశయ సాధన కోసం టీడీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు వాసిరెడ్డి జయరామయ్య అన్నారు. తాడికొండ గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సహకారంతో శనివారం రక్తదాన శిబిరాన్ని వాసిరెడ్డి జయరామయ్య, ఆర్‌హెచ్‌సీ డాక్టర్ కమలశ్రీ ప్రారంభించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం తెలుగుయువత, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

తుళ్లూరులో..


తుళ్లూరులో అన్నదానం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

తుళ్లూరు, జనవరి 18: తెలుగు జాతి ఖ్యాతిని ఖండాంతరాలు విస్తరింపజేసిన మహోన్నత వ్యక్తి నందమూరి తారక రామారావు అని టీడీపీ నేతలు అన్నారు. వాడవాడల ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. పెదపరిమిలోని గ్రంథాలయం సెంటర్, ఎన్టీఆర్ సెంటర్‌లో ఆయన విగ్రహాలకు నాయకులు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు, తెలుగు రైతు ఉపాధ్యక్షుడు నూతలపాటి రామారావు, నాయకులు కర్నాటి శ్రీనివాసరావు, పోతుగుంట నర్సయ్య, రాయపాటి హరిబాబు, బాష్యం శ్రీధర్ కార్యకర్తలు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తుళ్లూరు గీతా మందిరం సెంటర్‌లో తెలుగుయువత మండల అధ్యక్షుడు మూల్పూరి నరేష్ అధ్యక్షతన ఎన్టీఆర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ ఆలూరి గోపాల్రావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, టీడీపీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ నూతన సంవత్సర క్యాలెండర్‌లను ఆవిష్కరించి పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. లైబ్రరీ సెంటర్‌లో రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు, గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండలు వేసి ఘన నివాళులర్పించారు. తాడికొండ నియోజకవర్గ ఆర్టీఎస్ కోఆర్డినేటర్ నెలకుదిటి చంద్రశేఖర్ ఎన్టీఆర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. దొండపాడు, వడ్డమాను, ఐనవోలు, మందడం, రాయపూడి, వెంకటపాలెం, బోరుపాలెం, హరిశ్చంద్రపురం, శాఖమూరు, లింగాయపాలెం, ఉద్దండ్రాయునిపాలెం తదితర గ్రామాల్లో ఎన్టీఆర్‌కు నివాళి అర్పించారు.

వెంకటపాలెంలో మోదుకూరి వినయ్ దంపతులు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు జమ్ముల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బెల్లంకొండ నరసింహారావు, లంకా సుధాకరరావు, మాజీ సర్పంచ్ చేకూరి రవి, ఉగ్గం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు మండలంలో..

ప్రత్తిపాడు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పేదవారిని ఇచ్చే కిలో రెండు రూపాయల బియ్యంలో.. పేదలకు కట్టించే పక్కా ఇళ్లల్లో.. ఆడపిల్లలకు సమాన హక్కు ఇచ్చే దానిలో ఆయన ఉన్నారు... అందరి మనస్సుల్లో నిలిచి ఉన్నారు.. అలాంటి వ్యక్తికి మరణం లేదని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. మండల పరిధిలోని ప్రత్తిపాడు, కోయవారిపాలెం గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలను కేంద్ర మంత్రి పెమ్మసాని సోదరుడు రవిశంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ సమాజమే దేవాలయం అన్నారని, నేడు చంద్రబాబు అదే స్ఫూర్తితో సూపర్ సిక్స్ పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. ఈ సందర్భంగా ఈ రెండు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర తెలుగు మీడియా కో ఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్, అయినంపూడి నాగేశ్వరరావు, గద్దె రాము, కోయవారిపాలెం సర్పంచ్ నాగమల్లేశ్వరరావు, ఎంపీటీసీ మధు తదితరులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్


కోయవారిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, పక్కన పెమ్మసాని సోదరుడు రవి

వైసీపీ కోటలో ఎన్టీఆర్ విగ్రహం

ప్రత్తిపాడులో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ నియోజకవర్గంలో అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ప్రత్తిపాడులో రెడ్డి సామాజిక వర్గంతో మమేకమై ఉన్న శాలివాహన బజారుల్లో గాని, ఏరియాలో కాని ఇంతవరకు టీడీపీ నాయకులు అడుగు పెట్టింది లేదు.. ప్రచారం చేసిందీ లేదు. అలాంటిది గత అసెంబ్లీ ఎన్నికల్లో బూర్ల రామాంజనేయులు ఈ ప్రాంతంలో తొలిసారి అడుగు పెట్టి ప్రచారం నిర్వహించారు. విగ్రహావిష్కరణ సందర్భంగా ఆ బజారుల్లో ఎమ్మెల్యే బూర్ల నిర్వహించిన ర్యాలీ ఈ వర్గంలో పార్టీ బలోపేతానికి నిదర్శనంగా నిలుస్తుంది. విగ్రహావిష్కరణకు వచ్చిన రామాంజనేయులును స్థానికులు శాలివాహన సంఘం రామాలయం వద్దకు తీసుకువెళ్లారు. ప్రత్యేక పూజల అనంతరం ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడంతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వట్టిచెరుకూరులో..


పుల్లడిగుంటలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉప్పుటూరి చిన రాములు తదితరులు

వట్టిచెరుకూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి ఖ్యాతిని దశ, దిశలా చాటిన మహోన్నత వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకొని చిరస్మరణీయుడిగా నిలిచారని నేతలు కొనియాడారు. వట్టిచెరుకూరు గ్రామంతో పాటు మండల వ్యాప్త గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. కుర్నూతల గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు అత్తోట బాలకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మర్రి సాంబశివరావు, నల్లూరి సాంబశివరావు, జూటూరి ఏసుబాబు, మండల ఐటీడీసీ ఇన్‌చార్జ్ జే సుమన్ పాల్గొనగా, వట్టిచెరుకూరు గ్రామంలో సర్పంచ్ విజ యకుమార్, ఉపసర్పంచ్ యడ్లపల్లి సత్యనారాయ ణ, గ్రామ అధ్యక్షుడు ఏదుబాటి శివయ్య, ఎంపీటీసీ భీమినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పుల్లడిగుంట గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి ఉప్పుటూరి చిన రాములు, మాజీ సర్పంచ్ ఉప్పు టూరి గోవర్ధనరావు, సదాశివరావు, గ్రామ అధ్యక్షు డు ముప్పరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాకుమానులో..

కాకుమాను, జనవరి 18 : మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు వర్ధంతిని మండల వ్యాప్తంగా టీడీపీ నాయకులు నిర్వహించారు. కాకుమానులో మండల పార్టీ అధ్యక్షుడు నువ్వుల సునీల్ చౌదరి తదితర టీడీపీ నాయకులు బీకేపాలెం రహదారిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లా వీరయ్య చౌదరి, గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్లమోతు పూర్ణచంద్రరావు, బోడపాటి ప్రసాద్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొమ్మూరు, కొండపాటూరులో ఎస్సీ కాలనీలో, చిన్నలింగాయపాలెం, బోడిపాలెం, రేటూరు, అప్పాపురం, తెలగాయపాలెం, కొండబాలవారిపాలెం తదితర గ్రామాల్లో పార్టీ నాయకులు కార్యకర్తలు ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఫిరంగిపురంలో..

ఫిరంగిపురం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు జాతి ఆత్మగౌరవ పతాక ఎన్టీఆర్ అని జిల్లా టీడీపీ కార్యవర్గ కార్యదర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు అన్నారు. ఫిరంగిపురంలోని ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో తెలుగుదేశం జెండాను శనివారం టీడీపీ మండల అధ్యక్షుడు మండవ నరసింహారావు ఆవిష్కరించి ఎన్టీఆర్ విగ్రహానికి గజమాలను వేసిన అనంతరం కోటేశ్వరరావు మాట్లాడారు. అనంతరం కార్యకర్తలకు, గ్రామ ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కటికల అప్పారావు, పుల్లారెడ్డి, కోటా శేషు, నలజర్ల అప్పయ్య, చిట్టా వీరారెడ్డి, గుండెగ జోజి, కే యోహాను, బంధ నాథం సతీష్, వేల్పుల అంకారావు, కటికల రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడులో...

పెదనందిపాడు, జనవరి, 18 (ఆంధ్రజ్యోతి) : తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అని మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ అన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహ, చిత్రపటాలకు నాయకులు, ప్రవాసాంధ్రులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముద్దన నగరాజకుమారి, మాజీ జడ్పీటీసీ బత్తిని శారదా వేణు, ఆయా గ్రామ పార్టీల అధ్యక్షులు రావి శివరామకృష్ణయ్య, బండి నాగబాబు, చెన్నుపాటి సురేంద్ర, బొగ్గవరపు చంద్రశేఖర్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు చాగంటి సత్యహర్ష, కాండ్రు ప్రసాదు, తెలుగు రైతు కార్యదర్శి మోపర్తి చెంచయ్య, కట్టా రామరాజు, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, పాటిబండ్ల మురళి, కలవకూరి వెంకట్రావు, ఆళ్ల పణిబాబు, నాగండ్ల శ్రీనివాసరావు, దివ్వి నాగరాజు, రామినేని చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి శంకుస్థాపన

మండల పరిధిలోని నాగులపాడులో గ్రామ కమిటీ, తెలుగుయువత ఆధ్వర్యంలో బొడ్డురాయి సెంటర్లో ఎన్టీఆర్ విగ్రహ నిర్మాణానికి మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ శనివారం శంకుస్థాపన చేశారు. ప్రపంచ నలుమూలల తెలుగు వారి ఖ్యాతిని వ్యాపింపజేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని అన్నారు. అనంతరం కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు బండి నాగబాబు, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, కలవకూరి వెంకట్రావు, తెలుగుయువత నాయకులు నార్ల రాజేష్, ఆళ్ళ పణిబాబు, బండి కిరణ్ కుమార్, సందిరెడ్డి ఉమామహేశ్వరరావు, గొల్లపూడి కార్తికేయచౌదరి తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో..


మంగళగిరి ఎమ్మెస్సెస్ భవన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

మంగళగిరి సిటీ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బస్టాండు వద్ద ఎన్టీఆర్, ఎమ్మెస్సెస్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఎన్టీఆర్ యావత్ తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ధర్మకర్త తమ్మిశెట్టి జానకీదేవి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివశేషగిరిరావు, టీడీపీ నేతలు గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, గాదె పిచ్చిరెడ్డి, ఆరుద్ర భూలక్ష్మీ, అన్నం నాగబాబు, వాకా మాధవరావు, షేక్ జిలానీ, షేక్ సుభానీ తదితరులు పాల్గొన్నారు. పెదవడ్లపూడిలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్, నేతలు యేళ్ల శివరామయ్య, మాదల రమేష్‌బాబు, యేళ్ల శంకర్, అన్నే చంద్రశేఖర్, యేమినేని సుధాకర్, బోయపాటి రమేష్ తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. మంగళగిరి 8వ వార్డులో గోవాడ దుర్గారావు, వంగర పెదలక్ష్మయ్య, జొన్నాదుల మల్లేశ్వరరావు, గోసాల రాఘవ, తాటిపాముల లక్ష్మీపెరుమాళ్ళు, చల్లా సత్యనారాయణ, తిరుమలశెట్టి హనుమంతరావు, గద్దె శ్రీమన్నారాయణ తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.

దుగ్గిరాలలో..

దుగ్గిరాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయాలను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారన్నారు. చిలువూరులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ మాట్లాడుతూ ఎన్టీఆర్ పేదల కోసం చేపట్టిన సంక్షేమపథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు ప్రసంగించారు. స్థానిక అన్న క్యాంటీన్ వద్ద పేదలకు భోజనం ఏర్పాటు చేశారు. చిలువూరు, ఈమని, రేవేంద్రపాడు, పెనుమూలి, కెఆర్‌కొండూరు తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. సర్పంచ్ చిలువూరు మాణిక్యం, ఎంపీటీసీ మరియ రోజమ్మ, మాజీ జడ్పీటీసీలు యేళ్ల జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో..

తాడేపల్లి/తాడేపల్లి టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతిని పురస్కరించుకుని టీడీపీ నాయకులు, కార్యకర్తలు మండల, పట్టణ పరిధిలోని వివిధ ప్రాంతాలలో, సీతానగరం, వడ్డేశ్వరం, కుంచనపల్లిలో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు నేతలు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు ఎన్టీఆర్‌తోనే ప్రారంభమయ్యాయని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమాల్లో మండల, పట్టణ టీడీపీ అధ్యక్షులు అమరా సుబ్బారావు, వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


పెదవడ్లపూడిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించిన టీడీపీ నేతలు

పరిసరాల శుభ్రత ప్రజల బాధ్యత

మంగళగిరి సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంటీఎంసీ కమిషనర్ షేక్ అలీం బాషా అన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మంగళగిరిలో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. గాలిగోపురం వద్ద నుంచి మిద్దె సెంటరు వరకు అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు ర్యాలీ నిర్వహించి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలచేత స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల, కూటమి నేతలు గోవాడ దుర్గారావు, తుల్లిమిల్లి రామకృష్ణ, పంచుమర్తి చిన్నా, వాకా మాధవరావు, జొన్నాదుల బాలకృష్ణ, గోసాల రాఘవ, కాండ్రు భానుకిషోర్, కొండా నవనీత్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వట్టిచెరుకూరులో...


స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో భాగంగా కాట్రపాడు పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

వట్టిచెరుకూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తల పెట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం వట్టిచెరుకూరుతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి గ్రామ కూడళ్లల్లో ప్రతిజ్ఞ చేశారు. వట్టిచెరుకూరులో నిర్వహించిన ర్యాలీలో ఎంపీపీ చిలక రాజ్యం, ఎంపీడీవో రమేష్ బాబు, డీటీ దరియావలి, సర్పంచ్ విజయ కుమార్, ఉప సర్పంచ్ యడ్లపల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ భీమినేని కోటేశ్వరరావు, మండల స్థాయి అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొని వీధులను శుభ్రం చేశారు. కాగా కాట్రపాడు పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ సుచిత, ఏఎన్‌ఎంలు, హెడ్ నర్సులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని పరిసరాలను శుభ్రం చేస్తూ పీహెచ్‌సీ ప్రాంగణంలో ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాకుమానులో..

కాకుమాను, జనవరి 18(ఆంధ్రజ్యోతి) : పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తహసీల్దార్ వెంకట స్వామి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శనివారం స్వచ్ఛ భారత మిషన్ స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పిచ్చిచెట్ల తొలగించారు. తహసీల్దార్ సిబ్బందితో కలసి చెట్లను తొలగించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుతామని సిబ్బందితో కలసి ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. చిన్నలింగాయపాలెంలో ఎంపీడీవో యుగకీర్తి స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

తుళ్లూరులో...

తుళ్లూరు, జనవరి 18 : (ఆంధ్రజ్యోతి) స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా తుళ్లూరులో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌పై శనివారం ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి లైబ్రరి సెంటర్ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛ భారత్ ప్లకార్డులు ప్రదర్శించారు. సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛ భారత్‌పై నినాదాలిచ్చారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని, శుభ్రత లేని ఇళ్ళు, ఊరు అభివృద్ధికి నోచుకోలేవని మండల స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ సూచించారు.

తాడికొండలో...

తాడికొండ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మనం నివసించే పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛత దివస్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గంగరాజు మాట్లాడుతూ కుటుంబ పరిశుభ్రత ఇంటికి వెలుగు అని, గ్రామ పరిశుభ్రత ప్రజలందరికీ వెలుగు అని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తోకల సరోజిని, తహసీల్దార్ కే.నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడులో...

పెదనందిపాడు, జనవరి, 18 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శనివారం అధికారులు, ప్రజాప్రతినిధులు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. అనంతరం మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శంకరబాబు, ఎంపీడీవో లక్ష్మీదేవి, ఆయా గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న జయసత్య తదితరులు

మంగళగిరి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను స్థానిక టీడీపీ నేతలు శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఎర్రబాలెం గ్రామానికి చెందిన భీమవరపు శివకుమారికి రూ.1,90,164, రాజనాల శ్రావణ సంధ్యకు రూ.1,30,214, దోనె చంద్రకుమారికి రూ.1,08,600, గడదాసు హరికృష్ణకు రూ.5,01,946 చొప్పున మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, టీడీపీ నేతలు ఆకుల ఉమామహేశ్వరరావు, నీలం అంకారావు, గడదాసు రంగారావు, ఆకుల పానకాలరావు తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లికి చెందిన మూరతోట సుబ్బారావుకు రూ.3,98,800, మంగళగిరికి చెందిన గూడవల్లి ఆనంద్‌బాబుకు రూ.1,78,821, నీరుకొండ గ్రామానికి చెందిన చావలి హరికుమార్‌కు రూ.45 వేల చొప్పున చెక్కులను టీడీపీ నేతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మాజీ కౌన్సిలర్ దామర్ల పద్మజ, కారంపూడి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నృసింహుని హుండీ ఆదాయం రూ.55.78 లక్షలు

మంగళగిరి సిటీ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఎగువ, దిగువ సన్నిధులతోపాటు ఉపాలయమైన శ్రీపద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులతో సమర్పించబడిన కానుకల హుండీలను శనివారం లెక్కించారు. ఎగువ సన్నిధిలోని హుండీల ద్వారా రూ.24,87,319లు, దిగువ సన్నిధిలోని హుండీల ద్వారా రూ.29,93,901, శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీల ద్వారా రూ.64,250, నిత్యాన్నదాన పథకం నిమిత్తం రూ. 33,373 వచ్చినట్టు దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో అన్నపురెడ్డి రామ కోటిరెడ్డి తెలిపారు. హుండీల లెక్కింపును పొన్నూరు శ్రీసహస్ర లింగేశ్వరస్వామి దేవస్థానం కార్య నిర్వహణాధికారి జీ.వెంకట అమర్ పర్యవేక్షించారు.

8 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

గుంటూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ స్వాధీనం చేసుకున్నారు. పట్టాభిపురం ఎస్ఐ ఆంజనేయులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఫిరంగిపురం కు చెందిన మేడా నాగేశ్వరరావు అనే వ్యక్తి బొలెరో వాహనంలో 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా శ్యామలనగర్ రైల్వే గేట్ వద్ద డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్ ఖాదర్ బేగ్ స్వాధీనం చేసుకొని పట్టాభిపురం పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు రేషన్ బియ్యం వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తెనాలిలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీరవల్లి మురళి, నాగ భూషణం, వేణు, సాయిగిరి, తదితరులు

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్

- మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్
- వివిధ ప్రాంతాల్లో వర్ధంతి కార్యక్రమాలు
- తెనాలిలో రక్తదాన శిబిరం
- ఎన్టీఆర్ చిత్రపటాలకు, విగ్రహాలకు నివాళులు
- కొల్లిపరలో సత్యహరిశ్చంద్ర నాటకం

తెనాలి రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక దివంగత ఎన్టీఆర్ అని ఆయన సినీ, రాజకీయాల్లో ధ్రువతారగా వెలుగొంది ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శనివారం టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఎదురుగావున్న ఎన్టీఆర్‌విగ్రహానికి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ నియోజవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించి రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. పట్టణ, మండల అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు, కొల్లిపర మండల నేతలు సాంబిరెడ్డి, నన్నపనేని సుధాకర్, బండ్ల మాధవరావు, మహమ్మద్ ఖుద్దుస్, జొన్నాదుల మహేష్, కౌన్సిలర్లు బోయపాటి అరుణ, దివి అనిత, పెండేల వెంకట్రావు, పాలడుగు సురేంద్ర, ఈదర వెంకటపూర్ణచంద్, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, కంచర్ల ఏడుకొండలు, సుద్దపల్లి నాగరాజు, ముల్లపూడి వెంకట్, అన్నం పిన్నారావు, కనక రాంబాబు, సురేష్, మల్లవరపు విజయ్‌కుమార్, తెలుగు మహిళలు, కూటమి శ్రేణులు, ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు

తెనాలిరూరల్, (ఆంధ్రజ్యోతి): చినరావూరు రావి చెట్టు సెంటర్‌వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి అభిమానులు పరిశ వెంకటేశ్వరరావు మిత్రబృందం కలిసి పూలమాలలతోనివాళులర్పించారు.అనంతరం అన్నదానం చేశారు. పట్టణంలోని చెంచుపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, నాయకులు రావి సూర్యకిరణ్‌తేజ, కాకుమాను కనక రాంబాబు, రావి దత్తు, రాయపాటి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, గాజులవర్తి సురేష్, నేలపాడు రాము పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐతానగర్ సెంటర్లో రాష్ట్ర వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి ఈదర వెంకటపూర్ణచంద్ ఆధ్వర్యంలో ఎస్సీసెల్ టీడీపీ అధ్యక్షుడు అత్తోట శరత్, నీటి సంఘాల అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, వసంతం అశోక్, అన్నాబత్తుని శ్రీనివాసరావు, పోపూరి రామ్మోహనరావు, కాకుమాను సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు.

తెనాలి, మారీసుపేట, (ఆంధ్రజ్యోతి): సినీ, రాజకీయ రంగాల్లో తెలుగువారి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా వెలుగెత్తిచాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి అన్నారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని అంగలకుదురు గణేష్‌యూత్ వీరవల్లి మురళి ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో తొలి కాంస్య విగ్రహంగా ప్రసిద్ధి చెందిన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి గణేష్‌యూత్ సభ్యులతో కలసి వీరవల్లి మురళి, అంగలకుదురు ఉపసర్పంచి కనగాల నాగభూషణం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బొద్దులూరి వేణు, గొల్లపూడి సాయిగిరి, నిజాముద్దిన్, ఎల్‌ఎంఎల్ ఖాదర్, ముక్కామల సుబ్బయ్య, కనగాల పిచ్చయ్య, వార్డు మెంబర్ కృష్ణవేణి, ఆదినారాయణ, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి పార్టీ శ్రేణులతో మాజీ మంత్రి ఆలపాటి, ప్రసంగిస్తున్న సుధాకర్

అంగలకుదురు గ్రామంలో శనివారం ఎన్టీఆర్ వర్ధంతిని టీడీపీ గ్రామ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

32వ వార్డులో.. పట్టణంలోని బాలాజీరావు పేట 34వ వార్డులో శనివారం ఎన్టీఆర్ వర్ధంతిని వార్డు ప్రెసిడెంట్ ఎన్టీఆర్ జగన్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కనక రాంబాబు పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బొందలపాటి శ్రీకాంత్, గాలి సృజన్, యర్రగుంట మహేష్‌బాబు, నేలపాటి రాము, షేక్ దావూద్, అహ్మద్ షరీఫ్, ఏలూరు ప్రసాద్, చల్లా లక్ష్మణ్ పాల్గొన్నారు.

కొల్లిపర, (ఆంధ్రజ్యోతి): కళాకారుడుగా, రాజకీయ నాయకుడుగా అందరి మన్నలు పొందిన వ్యక్తి ఎన్టీఆర్ అని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. శనివారం రాత్రి ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రం కొల్లిపరలో సత్యహరిశ్చంద్ర నాటకాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఆయన ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, దుగ్గిరాల మార్కెట్ యార్డు చైర్మన్ వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, రాధాకృష్ణారెడ్డి, షేక్ రఫీ పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి ఎన్టీఆర్ అని రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి అన్నారు. శనివారం కొల్లిపరలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 29వ వర్ధంతిని టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూములూరులో ఎన్టీఆర్ చిత్రపటానికి నేతలు పలువురు నివాళులర్పించారు. టీడీపీ నేతలు ఆరిమండ రాధాకృష్ణారెడ్డి, గుదిబండి గోవర్ధనరెడ్డి, కంచర్ల అమృతరాజు, ఆరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి, దాసరి నరసయ్య, టీడీపీ వెంకటరెడ్డి, షేక్ రఫీ, ఆరిమండ వెంకటరెడ్డి, చాగంటి నారాయణరెడ్డి, కోటిరెడ్డి, రాజా, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

పెదకాకాని, (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మెయిన్ సెంటరులోని ఎన్టీఆర్ విగ్రహానికి పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. అలాగే స్థానిక పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తక్కెలపాడు, ఉప్పలపాడు, పెదకాకాని, కొప్పురావూరుగ్రామాల్లో టీడీపీ నేతలు ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ముఖద్వారం వద్ద వికాస ఉద్యోగ సంఘం నేతలు, సభ్యులు ఎన్టీరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు ఆచార్య కే. సుమంత్‌కుమార్, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎం. సుబ్బారావు, డిగ్రీ పరీక్షల ఆర్డినేటర్ ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు, డిప్యూటీ ఇంజనీర్ ఎన్.వెంకటేశ్వరరావు, సీఈ ఆలపాటి శివప్రసాదరావు, ఉద్యోగులు వై.రాధాకృష్ణ, వికాస ప్రధాన కార్యదర్శి జై శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు డి.విజయ్ ప్రకాష్, సంయుక్త కార్యదర్శి నేలపాటి నాగేశ్వరరావు, కోశాధికారి కే. యేషయ్య, పాల్గొన్నారు.



పెదకాకానిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్రకుమార్, పక్కన టీడీపీ నేతలు

పొన్నూరుటౌన్, (ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్ అని ఏఎంసీ మాజీ చైర్మన్ మాదల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం పొన్నూరు పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్‌తోనే సంక్షేమ పాలన దేశంలో ప్రారంభమైందన్నారు. టీడీపీ నాయకులు బొర్రు రామారావు, పఠాన్ అహ్మద్ ఖాన్, బండ్లమూడి బాబురావు తదితరులు పాల్గొన్నారు. నిడుబ్రోలులో జాగర్లమూడి సుధీర్‌బాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. చింతలపూడి గ్రామంలో ఎన్టీఆర్, ధూళిపాళ్ల వీరయ్య చౌదరి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దొప్పలపూడి, మామిళ్ళపల్లి, వల్లభరావుపాలెం, పెదపాలెం, చేబ్రోలు మండలం నారాకోడూరు, వేజెండ్ల, వడ్లమూడి, చేబ్రోలు, వడ్లమూడి అడ్డరోడ్డు వద్ద సంగం డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



పొన్నూరు ఐలాండ్ సెంటర్లో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ రమేష్ బాబు తదితరులు

ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛ పొన్నూరు

● మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు

పొన్నూరుటౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతో పొన్నూరు పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు తెలిపారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమం సందర్భంగా పొన్నూరు పట్టణంలో మున్సిపల్ కార్యాలయం నుంచి ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలాండ్ సెంటర్లో జరిగిన సమావేశంలో కమిషనర్ రమేష్ బాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం 12 నెలలకు 12 థీమ్‌లతో ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. జనవరి నుంచి శుభ్ర ప్రారంభం థీమ్‌ను పట్టణంలో అమలుపరుస్తున్నట్లు చెప్పారు. పొన్నూరు పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. రహదారుల వెంట చెత్త చెదారాలు వేయవద్దని సూచించారు. గృహాలతోపాటు నివాస ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కూటమి పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండల పరిధిలోని ములుకుదురు గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ ర్యాలీ జరిగింది. ఎంపీడీవో చంద్రశేఖర్, సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే పొన్నూరు - చేబ్రోలు మండలాల్లో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను నిర్వహించారు. స్వచ్ఛదివస్ ప్రతిజ్ఞ చేశారు.

కొల్లిపర, (ఆంధ్రజ్యోతి): పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. శనివారం మండల కేంద్రం కొల్లిపరలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగించారు. తహసీల్దార్ కార్యాలయం, రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణను అధికారులు పరిశుభ్రం చేసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతే ప్రగతికి మెట్లు అని తెలిపారు. ఎంపీడీవో విజయలక్ష్మి, రిజిస్ట్రార్ ఆదినారాయణరెడ్డి, ఈవోపీఆర్డీ భార్గవ్, డిప్యూటీ తహసీల్దార్ ఉప్పాల రాజేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లలో వ్యర్థాలను తొలగించండి

తెనాలి, మారీసుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): డ్రెయిన్‌లలోని వ్యర్థాలను తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పారిశుధ్య కార్మికులకు సూచించారు. శనివారం పట్టణంలోని 19, 20వ వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మున్సిపల్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు ప్రజలు వ్యర్థాలను డ్రెయిన్‌లో వేయరాదని, మురుగు నీటి పారుదలకు ఆటంకం ఏర్పడుతుందని అన్నారు. ఇంటి నుంచి వచ్చే వ్యర్థాలను పారిశుధ్య కార్మికులకు ఇంటివద్దనే అందించాలని, మూడు బుట్టల విధానాన్ని అనుసరించాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డబుల్ హార్స్ ఫౌండేషన్ జట్టుకు పతకాలు

తెనాలి అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అండర్-17 బాల బాలికల క్రీడ పోటీల్లో డబుల్ హార్స్ ఫౌండేషన్ జట్టుకు పతకాలు లభించాయి. మహబూబ్‌నగర్‌లో 68వ జాతీయ స్థాయి క్రీడలు ఈ నెల 11 నుంచి 17 వరకు నిర్వహించారు. 17 ఆటల్లో 28 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల క్రీడాకారులు పాల్గొన్నారు. మొదటి స్థానం బాలుర విభాగంలో తెలంగాణ జట్టు కైవసం చేసుకోగా, రెండవ స్థానంలో ఆంధ్రప్రదేశ్ జట్టు నిలిచిందని కోచ్ నాగరాజు తెలిపారు. టీం విజయానికి కెప్టెన్ తేజసాయిరెడ్డి, గౌరీశంకర్, వెంకటేష్, విజయ రాజు, విజేష్ కృషి చేశారని తెలిపారు.

వైకుంఠపురంలో హరినామ సంకీర్తన

తెనాలి అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురం శ్రీలక్ష్మీపద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం హరినామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. పెరవలి వంశీకృష్ణ బృందం టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులను ఘనంగా సన్మానించారు. బృందం ఆధ్వర్యంలో ఆలపించిన కీర్తనలు భక్తులను అలరించాయి. ఈవో అనుపమ, టీవీఎస్‌శాస్త్రి, బాలచంద్రమౌళి, హనుమంతరావు పాల్గొన్నారు.

ఘనంగా సాయినాథుని ఊరేగింపు

తెనాలి అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సాయినాథుని సత్సంగ కేంద్రం ఆధ్వర్యంలో షిరిడి సాయిబాబా ఊరేగింపు శనివారం ఘనంగా నిర్వహించారు. బోసురోడ్డులోని సత్సంగ కేంద్రం నుంచి పూలతో అలంకరించిన వాహనంపై బాబాతో పాటు శరత్‌బాబూజీ ఫొటోలను ఉంచి పట్టణంలో ఊరేగించారు. సత్సంగ కేంద్రం 33వ వార్షికోత్సవాలను రెండు రోజులపాటు బుర్రిపాలెం రోడ్డులోని టీజీకే కల్యాణ మండపంలో నిర్వహిస్తారు. లెండీ వనంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామని నాగభూషణరెడ్డి తెలిపారు. దత్తు, సాయి, ఫణి, శ్రీనివాస్, కృష్ణ, రామలింగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ సొసైటీలో డిపాజిట్లపై 11 శాతం వడ్డీ

తెనాలి అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీలో డిపాజిట్లపై అత్యధికంగా 11 శాతం వడ్డీ ఇస్తున్నామని సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు తెలిపారు. శనివారం విలేకర్లతో మాట్లాడుతూ వాణిజ్య బ్యాంకుల కన్నా అదనంగా తమ డిపాజిట్లపై వడ్డీ ఉంటుందని, రుణాలపై వడ్డీ కూడా సరళతరం చేశామని తెలిపారు. సెప్టెంబరు నుంచి సేవింగ్స్ ఖాతాలపై ఐదు శాతం, 37 నెలల డిపాజిట్‌పై 11 శాతం, 36 నెలల డిపాజిట్లకు 10.5 శాతం, 24 నెలల డిపాజిట్‌కు 10 శాతం వడ్డీ అమలు చేస్తున్నామన్నారు. రికరింగ్ డిపాజిట్ల ద్వారా నాలుగు ఏళ్లకు 10.5 శాతం, మూడేళ్లకు 10 శాతం, రెండేళ్లకు 9.5 శాతం, ఏడాదికి 9 శాతం వడ్డీ లభిస్తుందన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై నెలవారీ వడ్డీ అందించే విధానం అమలు చేస్తున్నామని తెలిపారు. రూ.లక్ష రెండేళ్ల డిపాజిట్ చేస్తే ప్రతి నెలా రూ.781, మూడేళ్ల డిపాజిట్ చేస్తే రూ.822, నాలుగేళ్ల డిపాజిట్ చేస్తే ప్రతినెలా రూ. 863 వడ్డీ లభిస్తుందని ఖాతాదారులు, డిపాజిటర్లు వినియోగించుకోవాలన్నారు.

హెల్మెట్ ఆవశ్యకతను గుర్తించండి

తెనాలి క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాఘవరావు తెలిపారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణహాని తప్పుతుదని తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేగేట్ల మూసివేత

తెనాలి, మారీసుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రేపటి నుంచి తెనాలి స్టేషన్ నుంచి చుండూరు రైల్వే స్టేషన్ వరకు మూడవ రైల్వేలైన్ నిర్మాణ పనుల నిమిత్తం ఈ నెల 20వ తేదీ ఉదయం 7.00 గంటల నుంచి 22వ తేదీ సాయంత్రం 5.00 గంటల వరకు పినపాడు రైల్వే గేట్లను మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఆ మార్గంగా రాకపోకలు సాగించే వాహనదారులు గమనించి రైల్వే అధికారులకు సహకరించాలని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత

తెనాలి రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-2006 పదవ తరగతి పూర్వ విద్యార్థులు రూ.36వేలు విలువజేసే ఇన్వర్టర్, 25 కుర్చీలను పాఠశాల హెచ్‌ఎం ఎం.నాగేశ్వరరావు ఉపాధ్యాయులు అన్నారావులకు అందజేశారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు కంచి కృష్ణకాంత్, విష్ణుమొలకల శ్రీనివాస్, కొలకలూరు ప్రణీత్ బాబు, షేక్ గౌస్‌పేర్, సయ్యద్ కరిముల్లా, రాగం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పసుపు రైతుల ధర్నా

తెనాలి అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో అగ్ని ప్రమాదం కారణంగా నష్టపోయిన పసుపు రైతుల ధర్నా సోమవారం జరుగుతుందని రైతు సంఘ నాయకులు ములకా శివసాంబిరెడ్డి తెలిపారు. తెనాలి న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కార్యాలయం వద్ద జరుగుతుందన్నారు. రైతులంతా తరలి రావాలని కోరారు. ప్రమాదం జరిగి ఏడాది గడిచినా ఇన్సూరెన్స్ క్లెయిమ్ రాలేదని తెలిపారు.



ఇందిరాదేవిని పరామర్శిస్తున్న చంద్రబాబు(ఫైల్)

శతాధిక వృద్ధురాలి మృతి

పొన్నూరుటౌన్, జనవరి18 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలం, చింతలపూడి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ధూళిపాళ్ల ఇందిరా దేవి (105) శనివారం మృతి చెందారు. ఎన్నికల ముందు పొన్నూరు పర్యటనకు వచ్చిన నేటి సీఎం చంద్రబాబునాయుడు చింతలపూడి గ్రామంలో ఇందిరా దేవిని కలిసి ఆమె వయస్సు తెలుసుకొని ఆశీస్సుల అందుకున్నారు. ఆ సందర్భంగా ఇందిరాదేవి చంద్రబాబుతో మాట్లాడుతూ టీడీపీకి ఓటు వేసి చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత చనిపోతానని చెప్పడంతో చంద్రబాబు కూడా ఆరోగ్యం బాగా చూసుకోవాలని ఆమెకు చెప్పారు. ఇందిరా దేవి మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, కూటమి పార్టీల నేతలు ఇందిరా దేవి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పరిశుభ్రతతోనే స్వచ్ఛ తెనాలి సాధ్యం

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే స్వచ్ఛ తెనాలి సాధ్యమౌతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. శనివారం చినరావూరులోని సత్యనారాయణ లేక్ పార్కులో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ అవగాహన కార్యక్రమాన్ని పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మున్సిపల్ కమిషనర్ శేషన్నతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలతో పాటు తమ వార్డు పరిసరాలను శుభ్రంగా వుంచి ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించాలన్నారు. స్వచ్ఛ తెనాలి సాధించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరావు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న కౌన్సిలర్ కోటేశ్వరావు తదితరులు

డొంక సమస్య పరిష్కారానికి కృషి

● తహసీల్దార్లు గోపాలకృష్ణ, సునీత

తెనాలి రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరు- దుగ్గిరాల పొలిమేరల్లో ఉన్న అడ్డిమూల డొంక ఆక్రమణలకు గురై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెనాలి, దుగ్గిరాల మండలాల తహసీల్దార్‌లు గోపాలకృష్ణ, సునీతలు చెప్పారు. కొలకలూరు గ్రామంలో అడ్డిమూల డొంకను ఆనుకుని రైల్వే లైను వేస్తుండటంతో మిగిలిన పొలం ఆక్రమణలకు గురై రైతులకు రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీనిపై తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణకు రెవెన్యూ గ్రామసభలో అర్జీలు అందించారు. రెండు మండలాల పొలిమేర కావడంతో ఇద్దరు తహసీల్దార్‌లు శనివారం డొంకమార్గాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా స్థలానికి కొలతలు వేసి 2 రోజుల్లో జెంగిల్ క్లీయరెన్స్ పనులు చేపడతామని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

తెనాలి అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులో క్లాసిక్ స్పోర్ట్స్ ఎరినా బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరగనున్న టోర్నమెంట్‌ను ఎస్‌ఎస్‌ఎస్ ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వహిస్తుంది. డాక్టర్ కేవీ నరేంద్ర టోర్నమెంట్ ప్రారంభించి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యం ఉండాలన్నారు. గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని చెప్పారు. సమీర్, సోహల్, షకీల్, రేవంత్, ఖాదర్‌బాషా, దిలీప్, తరుణ్, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

చేబ్రోలు, జనవరి18 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు కొమ్మమూరు కాలువ వద్ద యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. చేబ్రోలు ఎస్సై డి వెంకటకృష్ణ కథనం ప్రకారం యువకుడు మృతి చెంది ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. ఎస్‌ఐ వెంకటకృష్ణ సంఘటన స్థలానికి చేరుకోగా కొమ్మమూరు కాలువ సమీపంలో చెట్టుకు కండువాతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసకున్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియ రాలేదు.

గుంటూరు నాన్‌స్టాప్ సర్వీసులు పునఃప్రారంభం

తెనాలి అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ గుంటూరు నాన్‌స్టాప్ సర్వీసులను శనివారం పునః ప్రారంభించారు. తెనాలి బస్ స్టేషన్‌లో కొత్తగా వచ్చిన బస్సులను డిపో మేనేజర్ రాజశేఖర్ ప్రారంభించారు. గుంటూరు నాలుగు ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేశామని, ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు నిరంతరం ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయని, ప్రయాణికుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని మంత్రి ఆదేశాల మేరకు ఈ నాన్‌స్టాప్ సర్వీసులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మంత్రి సహకారంతో ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో మరిన్ని కొత్త సర్వీసులు రానున్నాయని, స్టేషన్ అభివృద్ధిపై కూడా దృష్టి సారించామని డీఎం చెప్పారు. వివిధ సంఘాల నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇసుక రీచ్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

కొల్లిపర, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇసుకరీచ్ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. శనివారం మండల కేంద్రం కొల్లిపర తహసీల్దార్ కార్యాలయంలో ఇసుకరీచ్ నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సిద్ధార్థ మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే వాహనాలకు ఇసుకను లోడు చేయాలన్నారు. కూలీలతో ఇసుకను ట్రాక్టర్లకు పోసి అక్కడి నుంచి ఒడ్డుకు తరలించాలన్నారు. ఒడ్డుకు తరలించిన తర్వాతే ఎక్స్‌కవేటర్‌తో లారీలకు ఇసుక నింపాలన్నారు. 6 గంటల తర్వాత డంపింగ్ దగ్గర కూడా ఇసుకను లోడు చేయకూడదన్నారు. సమావేశంలో ఎస్‌ఐ కోటేశ్వరరావు, ఆర్‌ఐ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కోడలుపై అత్త ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అత్తపై కోడలు దాడి చేసిందంటూ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం స్థానిక చెంచుపేట డొంకరోడ్డుకు చెందిన మద్దు తేలేజమ్మ తన కుమారుడు జోసఫ్, కోడలు బూలక్ష్మితో కలసి ఒకే గృహంలో నివసిస్తున్నారు. భర్త లేకపోవడంతో కుమారుడు పెయింట్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో పని నిమిత్తం కుమారుడు బయటకు వెళ్లాక అత్తాకోడళ్ల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో మాటమాట పెరిగి అత్తపై కోడలు పిడిగుద్దులు గుద్ది గాయపర్చింది. దాడిగురైన తనకు రక్షణ కల్పించాలంటూ శనివారం బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు వాకర్స్‌క్లబ్ వార్షికోత్సవం

తెనాలి అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ క్లబ్ 25వ వార్షికోత్సవం ఆదివారం కవిరాజా పార్కులో జరుగుతుందని అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం తెలిపారు. క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పెద్ది శివరామప్రసాద్, ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ చెలికాని సీతారామయ్య, జిల్లా కోశాధికారి లఘువరపు సత్యనారాయణ అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఉత్తమ వాకర్ మెడతాటి బాబూజీ, ఉత్తమ మహిళా వాకర్ ఎస్.ధనలక్ష్మి, ఉత్తమ యోగసాధకురాలు తుమ్మలపల్లి ఉషారాణి, హెల్పింగ్ సోల్జర్ షేక్ ఇనయ్‌తుల్లాలను సన్మానిస్తామని తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 203కి అనుబంధంగా 2000 సెప్టెంబరు 1న వాకర్స్ క్లబ్ చార్టర్ పొందిందని డాక్టర్ దక్షిణామూర్తి అధ్యక్షతన టెలికాం డీఈ పీఎస్‌ఎన్‌మూర్తి ప్రోత్సాహంతో క్లబ్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని తెలిపారు.

స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌లో

డిప్యూటీ సీఎంతో అభిమానుల సందడి

పెదకాకాని, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలం నంబూరులో శనివారం నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పాల్గొన్నారు. ఆయన పర్యటన ఆద్యాంతం హర్షధ్వానాలతో సాగింది. ముందుగా నంబూరు డంపింగ్ యార్డ్‌ను పవన్‌కల్యాణ్ సందర్శించారు. ఆయన రాక విషయం తెలుసుకున్న అభిమానులు, కూటమి శ్రేణులు అధిక సంఖ్యలో అక్కడకు చేరుకొని కేరింతలు కొడుతూ నినాదాలు చేశారు. ఆసందర్భంగా పవన్‌కల్యాణ్ పలుసార్లు చేతులు ఊపి అభిమానులకు అభివాదం తెలిపారు. పలువురితో సెల్ఫీలు దిగారు.





అభిమానులకు సెల్ఫీ తీస్తూ, బాలుడితో ఆప్యాయంగా పవన్‌కళ్యాణ్



పవన్ కళ్యాణ్ కోసం బారికేడ్ల వద్ద అభిమానులు